
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 2 డిసెంబరు 2025



నల్లమాడులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

నేనున్నానని..

బాధితులకు సీఎం చంద్రబాబు భరోసా



గోపీనాథపట్నంలో కిడ్నీ బాధితురాలు నాగలక్ష్మి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు - వార్త మెయిన్‌లో

సీఎం టూర్ సూపర్ సక్సెస్

ఉంగుటూరుకు వరాల జల్లు

- రోడ్లు, కాలేజీ భవనాలు నిర్మిస్తాం
- త్వరలోనే చింతలపూడి ఎత్తిపోతలు పూర్తి చేస్తాం
- వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం
- పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు కల్పిస్తాం
- సమస్యలపై సీఎంకు ఎమ్మెల్యే ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని నివేదన
- ఉంగుటూరులో ఉత్సాహంగా సాగిన సీఎం చంద్రబాబు పర్యటన

ఏలూరు/ఉంగుటూరు/నిడమర్రు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలో సోమవారం నిర్వహించిన పర్యటన సూపర్ సక్సెస్ అయ్యింది. పర్యటన ఆసాంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా సాగింది. ఆయనను చూసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో పొలం గట్ల మధ్య నుంచి పరుగులు పెట్టి వచ్చారు. ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన ఆయన ఉదయం 11.40 గంటలకు నల్లమాడు చేరుకున్నారు. అక్కడ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. గోపీనాథపట్నం వెళ్లి అక్కడ కిడ్నీ బాధితురాలు నాగలక్ష్మికి పింఛన్ అందజేసి కుటుంబానికి భరోసా కల్పించారు. ప్రజా వేదిక వద్ద తనను కలిసిన బాధితులకు నేనున్నానని అభయం ఇచ్చారు. అనంతరం పార్టీ కార్యకర్తలకు కష్టపడి పనిచేసే వారిని తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా వేదిక వద్ద వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన స్టాల్స్‌ను పరిశీలించారు. వివిధ రకాల వస్తువులు, పంటలు ఉత్పత్తి చేసిన వారితో మాట్లాడి.. వారిని ప్రోత్సహించేలా అధికారులకు సూచనలు ఇచ్చారు. పీ-4 కింద ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను





ప్రజా వేదిక సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, వేదికపై ఆప్కాబ్ చైర్మన్ గన్ని, మంత్రులు పార్థసారథి, మనోహర్, ఎమ్మెల్యే ధర్మరాజు, ఎంపీ పుట్టా, కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు.. హాజరైన జనం

మార్గదర్శకులు ఆదుకుని వారిని ఉన్నత స్థానంలో నిలపాలని కోరారు. 'పంచసూత్రాల ఆధారంగా రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి. దీనిపై ప్రతీ రైతుకు అవగాహన కల్పిస్తున్నాం. పెరటి కోళ్ల పెంపకం ద్వారా డ్వాక్రా మహిళలు ఇంటి వద్దే ఆదాయం సంపాదించేందుకు మార్గాలు వేస్తున్నాం. పామాయిల్ పంటను ప్రోత్సహిస్తాం. ఏలూరు జిల్లాలోను పరిశ్రమలు రావాలి. పారిశ్రామికవేత్తలకు సబ్సిడీలు, ఇతర ప్రోత్సాహకాలు ఇస్తాం' అంటూ జిల్లా పురోభి వృద్ధికి చంద్రబాబు భరోసా ఇచ్చారు. సభా వేదిక వద్ద చిన్నారులతో (మిగతా 8వ పేజీలో)



చిన్నారితో ముచ్చటిస్తున్న సీఎం చంద్రబాబు

చింతలపూడి పూర్తి చేయాలి



- చంద్రబాబు విజన్‌తో రాష్ట్రాభివృద్ధికి పూనుకున్నారు. స్వర్ణాంధ్ర ఆయనతోనే సాధ్యం. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడంతోపాటు, ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డు జాతీయ రహదారిగా ప్రకటించి, ఏలూరులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

- ఏలూరు ఎంపీ పుట్టా మహేష్

మా సమస్యలు తీర్చండి



- నియోజకవర్గంలో రూ.140 కోట్లతో వివిధ కార్యక్రమాలు చేపట్టాం. నల్లజర్ల- లక్ష్మీపురం రోడ్డును మంజూరుచేయాలి. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు నియోజకవర్గాన్ని అనుసంధానం చేయాలి. నారాయణపురం ఇంటర్ కాలేజీ, పొలసానిపల్లి గురుకుల పాఠశాల భవనాలు నిర్మించాలి. డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. గణపవరం మండల బీసీ బాలికల హాస్టల్ నిర్మాణం మంజూరు చేయాలి.

- ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

పామాయిల్ రైతులను ఆదుకోవాలి



- రూ.2 కోట్లు మంజూరు చేస్తే గొల్లగూడెంలో రోడ్లు బాగుపడతాయి. పామాయిల్ తోటల్లో విద్యుత్ తీగలు చెట్లకు తగిలి రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారు. విద్యుత్ లైన్లు మార్చుకోవడానికి చార్జీల కింద అధికారులు 25 శాతం కట్టమంటున్నారు. దాన్ని తగ్గిస్తే రైతులు లైన్లు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు.

- ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు

కూటమి కార్యకర్తలతో గొడవలొద్దు

ఉంగుటూరు నియోజకవర్గ పార్టీ శ్రేణుల సమావేశంలో సీఎం చంద్రబాబు

పార్టీ సుస్థిరతకు గన్ని కృషి అమోఘం

'కష్టపడి పనిచేసే కార్యకర్తలకు అండగా నేనున్నా. పార్టీ ఉంటుంది. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రతి పనిని పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. ప్రజలకు చేరువగా ఉన్నప్పుడే వారు మనల్ని గుర్తిస్తారు. కార్యకర్తల సంక్షేమమే నా లక్ష్యం. అందరూ కష్టపడి 2029 ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేయాలి' అంటూ సీఎం చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నల్లమాడులో సోమవారం 900 మంది ఉంగుటూరు నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'పార్టీ సుస్థిరత కోసం ఉంగుటూరు నియోజకవర్గంలో గన్ని వీరాంజనేయులు కృషి అమోఘంగా ఉంది. పార్టీ కేడర్‌లో కొన్ని ఇబ్బందులు



ఉన్నాయి. వాటిని త్వరలోనే సరిచేస్తాం. కూటమి పార్టీ కార్యకర్తలతో సఖ్యంగా ఉండాలి. మనం వాళ్లని కలుపుకుని వెళ్లాలి. కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుంది. గొడవలు పడవద్దు. కలసిమెలసి పనిచేయాలి. ఒక్కసారి నెగ్గడం కాదు.. (మిగతా 8వ పేజీలో)



మర్రిబంధంలో సామాజిక పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి పార్థసారథి

93.63 శాతం పింఛన్లు పంపిణీ

ఏలూరుసిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంలో డిసెంబరు నెల పింఛన్ పంపిణీ జిల్లాలో సోమవారం ఉదయం 7గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం 6గంటలకు పంపిణీ పూర్తయింది. ఈనెలలో 2,59,688 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా సోమవారం సాయంత్రం 6గంటల సమయానికి 2,43,146 (93.63 శాతం) మందికి పంపిణీ చేశారు. మిగిలిన లబ్ధిదారులకు 2వతేదీ సాయంత్రంలోగా నూరు శాతం పింఛన్‌లను పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

మర్రిబంధంలో మంత్రి కొలుసు అందజేత

నూజివీడు : సామాజిక పింఛన్లు కింద రూ.నాలుగు వేలు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మర్రిబంధంలో సోమవారం ఆయన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ కింద రూ.4 వేలను ప్రతీ నెల అందిస్తున్నారన్నారు. జిల్లాలో 2,60,036 మందికి రూ.113.7.2 కోట్లు ప్రతీనెలా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు, ఎంపీడీవో చెన్న రాఘవేంద్రనాథ్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఏలూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)పరీక్షకు జిల్లాలో 2,660 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్ష ఏలూరులో 6, నూజివీడు, జంగారెడ్డిగూడెంలో మూడుచొప్పున మొత్తం 12 కేంద్రాల్లో జరుగుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పరీక్షను నిర్వహిస్తారు. జిల్లాలో గత విద్యాసంవత్సరం (2024-25)లో ఎన్‌ఎంఎంఎస్‌కు 161 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఆర్.ఆశ తెలిపారు.

అర్జీలు తక్షణం పరిష్కరించాలి : డీఆర్వో



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందే ప్రతి అర్జీని పరిశీలించి సత్వరం పరిష్కరించాలని డీఆర్వో వి.విశ్వేశ్వరరావు సంబంధితాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 191 మంది అర్జీల ద్వారా తమ సమస్యలను అధికారులకు వివరించారు. అర్జీలను పరిశీలించిన డీఆర్వో సంబంధిత శాఖలకు వాటిని పంపించి పరిష్కారం చేయాలని సూచించారు. కార్పొరేషన్ కమిషనర్ భానుప్రకాశ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



కూలీల కొరతతో పొలంలోనే ఉండిపోయిన పత్తి

పత్తి రైతుకు... కష్టకాలం!

- తగ్గిన పంట దిగుబడి
- గిట్టుబాటు ధరలేక నిరాశ

కుక్కునూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పత్తి రైతాంగాన్ని కష్టాలు చుట్టు ముట్టాయి. ఒకవైపు ప్రకృతి ప్రకోపం, మరోవైపు కూలీల కొరత, గిట్టుబాటు ధర లేకపోవడంతో మూడేళ్లుగా రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఈ ఏడాది దాదాపు ఐదువేల ఎకరాల్లో పత్తి సాగైంది. సాగు కాలం ఆరంభం నుంచి వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆగస్టు నుంచి విస్తారంగా వర్షాలు కురవడంతో తెగుళ్లుచ పత్తికాయ నల్లగా మారడం, పూత, పిందె రాలి పోవడం, కాసిన పత్తి నేల రాలిపోవడం వంటి సమస్యలు ఎదుర్కొన్నారు. పంటను కాపాడుకోవడానికి రైతాంగం తీవ్రంగా శ్రమించారు. తీరా దిగుబడి వచ్చేసరికి కుదేలయ్యారు. ఎకరానికి 10 - 15 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం ఎకరానికి ఐదు క్వింటాళ్లలోపే దిగుబడి వస్తోంది. ఇదే సమయంలో అక్టోబరులో తుపాన్ కారణంగా పత్తి నల్లబారడంతో పాటు పుచ్చు ఏర్పడింది. ఈ కారణంగా ధర తగ్గింది. ప్రస్తుతం క్వింటా ధర రూ.5 వేల నుంచి రూ.6 వేల లోపు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం జంగారెడ్డిగూడెంలో సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కేంద్ర ప్రభుత్వం క్వింటా పత్తికి రూ.8110 మద్దతు ధర ప్రకటించింది. అయితే కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు స్లాట్ బుక్ చేసుకుని పత్తి అమ్మకాలు చేసుకోవాలి. రైతులకు ఈ యాప్‌పై అవగాహన లేక స్థానికంగానే పండిన పత్తి అమ్ముకుంటూ నష్టపోతున్నారు.

ప్రస్తుతం కూలీల కొరతను ఎదుర్కొంటున్నారు. అందరికి ఒకేసారి పత్తి తీతలు రావడంతో కూలీల సమస్య ఏర్పడింది. రోజు రూ.300 కూలి చెల్లిస్తున్న క్రమంలో రైతు పై తీవ్రంగా ఆర్థికభారం పడుతోంది. క్వింటా పత్తితీతకు రూ.2వేలు పైగా ఖర్చవుతోందని పెట్టి బడులు కూడా రాని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. మూడేళ్లుగా పత్తి రైతులు కాలం కలిసిరాక అప్పుల ఊబిలో కూరుకు పోయారు. ప్రస్తుతం మళ్లీ ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఏర్పడింది మరోవైపు తుపాన్ భయం వెంటాడుతోంది. ఇప్పటికే పంటచేలో ఉన్న పత్తిని పూర్తిగా తియ్యలేదు. వర్షం పడితే పత్తి తడిచి ధర ఇంకా పతనం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిత్వా.. వణుకు!

- జిల్లావ్యాప్తంగా తీవ్ర చలిగాలులు
- బెంబేలెత్తిన ప్రజలు..స్వల్పంగానే వర్షాలు

ఏలూరుసిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ బలహీన పడింది. కాని ఆ ప్రభావం జిల్లాలో కనిపిస్తోంది. వర్షాలు స్వల్పంగానే కురిసినా సోమవారం మధ్యాహ్నం నుంచి చలి గాలుల తీవ్రత విపరీతంగా పెరిగింది. ఏజెన్సీ ప్రాంత మండలాల్లో చలి తీవ్రత మరింత ఎక్కువగానే కనిపించింది. సాధారణంగా జిల్లాలో సోమవారం ఉదయం 24 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత, రాత్రి సమయంలో 20 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైనా గాలులు తీవ్రత గంటకు 26 కిలోమీటర్లుగా ఉంది. గాలిలో తేమశాతం 81 శాతంగా ఉంది. ఏలూరు నగరంతోపాటు జిల్లాలోని ప్రధాన పట్టణాలైన జంగారెడ్డిగూడెం, నూజివీడు, చింతలపూడి , కైకలూరు తదితర ప్రాంతాలతో పాటు ప్రధాన మండల కేంద్రాల్లో రహదారులపై రాత్రి సమయంలో జనసంచారం బాగా తగ్గింది. ఆర్టీసీ బస్సుల్లోను ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గింది.

ముమ్మరంగా వరి కోతలు

తుఫాన్ బలహీన పడడం, వర్షాలు అంతంత మాత్రంగానే కురియడంతో జిల్లాలోని చాలా మండలాల్లో సోమవారం వరి కోతలు ముమ్మరంగా కొన సాగింది. జిల్లాలో ఈ ఏడాది సార్వా వరి సాగు 2లక్షల 7వేల 286 ఎకరాల్లో చేయగా ఇప్పటివరకు 48 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. జిల్లాలో 99వేల 453 ఎకరాల్లో వరికోతలు పూర్తయినట్టు జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి.

వర్షపాతం వివరాలు

గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా కొయ్యలగూడెం మండలంలో 9.2 మిల్లీ మీటర్లు, పెదపాడు 5.4, కలిదిండి 5.4, మండవల్లి 4.6, ఉంగుటూరు 4.2, నిడమర్రు 3.8, కైకలూరు 3.6, ముదినేపల్లి 3.6, ఏలూరు అర్బన్ 3.4, ఏలూరు రూరల్ 3.2, ఆగిరిపల్లి 2.6, జంగారెడ్డిగూడెం 2.4, పోలవరం 2.4, నూజివీడు 2.2, బుట్టాయిగూడెం 1.8, కామవరపుకోట 1.8, చాట్రాయి 1.6, భీమడోలు 1.6, పెదవేగి 1.4, దెందులూరు 1.4, చింతలపూడి 1, జీలుగుమిల్లి 0.4, లింగపాలెం 0.2 మిల్లీ మీటర్లు వర్షపాతాలు నమోదయ్యాయి.



ముదినేపల్లిలో వరి పనలను పొలాల నుంచి రోడ్డుకు చేర్చుకుంటున్న రైతులు



ముదినేపల్లి మండలం చినపాలపర్రు వద్ద ధాన్యం రాశులపై కప్పిన బరకాలు

సమన్వయంతో పని చేయాలి

- మంత్రి కొలుసు పార్థసారథి.. అధికారులతో సమీక్ష

నూజివీడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ సహాయక కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రతిష్ట ఇనుమడింపచేసేలా అధికార యంత్రాంగం పని చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. దిత్వా తుఫాన్ పరిస్థితి, సహాయక చర్యలపై అధికారులతో వర్చువల్‌గా మంత్రి సమీక్షించారు. దిత్వా తుఫాను తీరం దాటే సమయంలో వేగంతో పెనుగాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతంలోని ప్రజలను తుఫాన్ పునరావాస కేంద్రాలకు తరలించాలని, వారికి నాణ్యమైన భోజనం, వసతి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం తడవకుండా రైతులను అప్రమత్తం చేయాలని అధికారులకు అదేశించారు. ఎక్కడా ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సహాయ కార్యక్రమాలలో నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

5న మెగా పీటీఎం.. భారీ ఏర్పాట్లు

లోపలి పేజీలో..

దర్జాగా కబ్జా
- ప్రభుత్వ భూములపై అక్రమార్కుల కన్ను
- యథేచ్ఛగా పొగాకు బ్యారన్‌ల నిర్మాణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం





సీఎంకు స్వాగతం పలికేందుకు వెళుతున్న ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు







ముఖ్యమంత్రి చంద్రబాబుకు అభివాదం చేస్తున్న మహిళలు, పార్టీ అభిమానులు

చంద్రబాబుకు ఘన స్వాగతం

నిడమర్రు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం నల్లమాడు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. పౌర సరఫరాల శాఖామంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మ రాజు, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

సీఎంకు వరికంకుల దండ

పెదపాడు/పెదవేగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతన్నల సంక్షేమానికి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రైతులు వరి కంకుల దండతో స్వాగతం పలికారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సారథ్యంలో పెదపాడు మండలానికి చెందిన రైతులు, కూటమి నేతలు వరికంకుల దండను అందజేశారు. గుత్తా అనిల్, అక్కినేని వంశీకృష్ణ, మరడాని రవి తదితరు లున్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్ పుష్పం అందించి స్వాగతం పలకగా ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషిని సీఎం ప్రశంసించారు.

స్టాల్స్ పరిశీలన

సభావేదిక వద్ద ప్రత్యేక స్టాల్స్ ప్రదర్శించారు. హెలికాప్టర్ దిగిన చంద్రబాబు గోపీనాథపట్నం వెళ్లి అక్కడ సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం నేరుగా సభా వేదిక వద్దకు చేరుకొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. రైతు పరిమి నాగేంద్ర ప్రసాద్ ఏర్పాటు చేసి ఒక ఎకరం భూమిలో ఫిష్ -ప్యాడీ క్రాప్ చేసే విధానం గురించి చంద్రబాబు అడిగి తెలుసుకొన్నారు. జిల్లా ఉద్యానవన అధికారి నాయక్ కోకోఫీట్ ద్వారా రైతులు పొందుతున్న వ్యవసాయ ఉత్పత్తులు గురించి వివరించారు. మహిళా సమాఖ్య సభ్యులకు 181 కోట్ల రూపాయల స్త్రీ నిధి చెక్కులను అందజేశారు. ఇళ్లలో పెంచుకొనే నాటుకోళ్ల పెంపకం ప్రాజెక్టును ఆసక్తిగా తిలకించారు. ప్రతి కుటుంబానికి ఈకోళ్ల పెంపకం ద్వారా 22 వేలు ఆదాయం వస్తుందని అధికారులు తెలిపారు. అప్పడాలు అమ్ముకొని జీవిస్తున్న డ్వాక్రా మహిళకు తక్షణం ఇల్లు కట్టేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరక్టర్ ఆర్.విజయరాజు, స్త్రీనిధి డైరక్టర్ శ్రీహరి ప్రసాద్‌లు వివరాలు తెలియజేశారు. అటవీ శాఖ స్టాల్ ను సందర్శించారు.కొల్లేరు గురించి కలెక్టర్, ఎమ్మెల్యే కామినేని, ధర్మరాజులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. పాపికొండలు టూరిజం ప్రాజక్టు గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. కొరటూరులో ఎన్ని కాటేజీలు నిర్మాణం చేశారు ? వాటికి ఎంత డిమాండ్ ఉందో పరిశీలించి సుమారు 100 కాటేజీల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని డీఎఫ్‌వో విజయకు సూచించారు.



ఎకరం పొలంలో చేపలు, వరి సాగు చేసే విధానం గురించి వివరిస్తున్న రైతు పరిమి నాగేంద్ర





చంద్రబాబు సభకు చేలల్లోంచి వస్తున్న మహిళలు





స్త్రీనిధి రుణాల చెక్కు అందజేత



పాడి రైతులకు బోనస్ పంపిణీ

ఏలూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):కృష్ణా మిల్క్ యూనియన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి పరిధిలోని పాడి రైతులకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రెండో విడత బోనస్‌గా రూ.2.8 కోట్ల చెక్కును సీఎం చంద్రబాబు నల్లమాడులో సోమవారం అందజేశారు. పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందని యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు వివరించారు.



బస్సు రాడ్ పట్టుకుని దిగుతున్న వృద్ధురాలు.. మోకాలి ఎత్తులో ఫుట్ బోర్డు..మగవారికీ ఇబ్బందే..

ఎక్కాలన్నా.. దిగాలన్నా యాతనే !

పల్లెవెలుగు అద్దె బస్సుల్లో మోకాళ్ల ఎత్తున ఫుట్ బోర్డు

ప్రయాణికులకు పాట్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):

ఒకప్పుడంటే ఆర్టీసీ బస్సుల్లో రద్దీ తక్కువగా ఉండేది. ఉచిత బస్సు ప్రయాణాలతో ఏ బస్సు చూసినా కిక్కిరిసి పోతున్నాయి. ఒకటే హడావుడి.. ఎక్కాలన్నా.. దిగాలన్నా చాలా సమయం తీసుకుంటోంది. అయితే ఇటీవల ఆర్టీసీ యాజమాన్యానికి అద్దె బస్సులు సరఫరా చేసిన ప్రైవేట్ యాజమాన్యాలు ఫుట్ బోర్డులను ఎత్తులో ఏర్పాటు చేశారు. ఈ బస్సుల్లో ఎక్కాలన్నా, దిగాలన్నా వృద్ధులు, దివ్యాంగులు పడరాని పాట్లు పడుతున్నారు. చంటి పిల్లలతో చీరలు ధరించిన తల్లులు పడుతున్న నరకం అంతా ఇంతా కాదు. మరోవైపు మూటలు, ఇతర లగేజీలతో దిగేవారి బాధలు దేవుడుకే ఎరుక.

70 బస్సుల్లో ఇదే తంటా !

ఏలూరు జిల్లా వ్యాప్తంగా 309 బస్సులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల్లో కలిపి మొత్తం 70కు పైగా పల్లె వెలుగు బస్సుల్లో ఎక్కి దిగే సమయంలో నరకం కనపడుతోంది. ప్రధానంగా చింతలపూడి, జంగారెడ్డిగూడెం, నూజివీడు, భీమవరం రూట్లలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు.

మరమ్మతులు చేయొచ్చు

ఫుట్‌బోర్డు మోకాలి ఎత్తులో ఉండడం వల్ల బరువున్న వారు దిగితే పాదాల నొప్పి పెరుగుతుంది. బరువు ఆపలేక కాళ్లు మడమలు చిట్లే ప్రమాదం ఉంది. ఎత్తులో ఉన్న ఫుట్‌బోర్డును సంబంధిత గ్యారేజ్‌ల్లో కట్ చేసి కిందకు దించవచ్చు. దీనికి గ్యారేజీలో మెకానిక్‌లు, ఇతర సిబ్బందితో లోపాలను సరి చేయవచ్చు. ఈ దిశగా ఆర్టీసీ డిపో మేనేజర్లు, డీపీటీవో స్పందించాల్సిన అవసరం ఉంది.

దర్జాగా కబ్జా

సొంత ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఇంటి కోసం ఒక సెంటు భూమి అడిగితే సవాలక్ష ప్రభుత్వ నిబంధనలు అడ్డంకులు ఉంటాయి. అదే బడాబాబులు కన్నేశారంటే ఎకరాలకు ఎకరాల ప్రభుత్వ భూమి వాటంతట అవే కాళ్ల వద్దకు చేరతాయి. దీనికి ఎటువంటి నిబంధనలు ఉండవు. నియమాలు ఉండవు. కేవలం అధికారుల చల్లని చూపే అక్రమార్కులకు శ్రీరామరక్ష. జంగారెడ్డిగూడెం మండంలో ఎకరాలకు ఎకరాలు కబ్జా అవుతున్నా అధికారులకు కనిపించడం లేదు..

- ప్రభుత్వ భూములపై అక్రమార్కుల కన్ను
- యథేచ్ఛగా పొగాకు బ్యారన్ల నిర్మాణం
- ఏటా లక్షల్లో అనధికార లావాదేవీలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

జంగారెడ్డిగూడెం రూరల్, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో గ్రామానికి చెందిన రైతులు ప్రభుత్వ భూమిలో పశువులను మేతకు తిప్పేవారు. ఆ భూములపై అక్రమార్కుల కన్ను పడింది. ఆ భూములను కబ్జా చేసి పొగాకు బ్యారన్‌లను నిర్మించేశారు. విద్యుత్ స్తంబాలు, కనెక్షన్‌లు వెలిశాయి. ఏళ్లపాటు ఈ వ్యవహారం సాగుతున్నా అటు రెవెన్యూ అధికారులు కానీ, ఇటు పంచాయతీ అధికారులు కానీ అటుగా వెళ్లిన పాపాన పోలేదు. అదే గ్రామంలో పిల్లలు చదువుకు నేందుకు పాఠశాలల అదనపు తరగతుల నిర్మాణం కోసం గ్రామస్థులు ఆ స్థలం కోసం అర్జీలు పెట్టుకున్నా ఎవరికీ పట్టక పోవడం గమనార్హం.

కబ్జా భూముల్లో పొగాకు బ్యారన్‌లు

పోరంబోకు భూముల్లో అక్రమంగా బ్యారన్‌లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే దాదాపు ఆరు బ్యారన్‌లు నిర్మించి వాటిలో గత నాలుగు, ఐదు సీజన్‌లుగా పొగాకు క్యూరింగ్ చేస్తున్నట్టు స్థానికులు చెబు తున్నారు. ప్రస్తుతం మరో మూడు బ్యారన్‌ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఒక్కో బ్యారన్ సీజన్‌కు కౌలు ధర దాదాపు రూ.1.50 లక్షలకు పైగానే ఉంది. ఇంత డిమాండ్ ఉన్న బ్యారన్‌లను ప్రభుత్వ భూముల్లో అడ్డదారిగా నిర్మిస్తున్నా ఎవరూ పట్టించుకోక పోవడంపై నివ్వెరపోతున్నారు.

పాఠశాల విద్యా కమిటీ ఫిర్యాదు

గతంలో ఈ ప్రభుత్వ భూముల్లో అక్రమంగా పొగాకు బ్యార న్‌లను నిర్మిస్తున్నారని వాటిని నిలుపుదల చేసి పాఠశాల అదనపు తరగతుల నిర్మాణానికి కేటాయించాలని మైసన్నగూడెం ప్రాథమి కోన్నత పాఠశాల విద్యాకమిటీ గతంలో జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లింది. ఈ ఏడాది సెప్టెంబరు 29వ తేదీన గ్రామస్థులు, విద్యాకమిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఈ భూమిలో అక్రమ నిర్మాణాలు ఆగలేదు. ఇక్కడ సెంటు రూ.1 లక్షల వరకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిమ్మకు నీరెత్తినట్టు అధికారులు

ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా ఎవరూ అటుగా చూడకపోవడంతో అక్రమార్కులకు అడ్డేలేకుండా పోయింది.ఇదే అదునుగా ఇప్పటికే ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఏడు బ్యారన్‌లతో పాటు మరికొన్ని నిర్మించేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఇప్పటికీ అధికారులు కళ్లుతెరవకపోవడంతో వారిపై మరిన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో ప్రతి ఏటా లక్షల్లో అక్రమార్కులకు, అధికారులకు లావాదేవీలు సాగడం వల్లే చూస్తూ ఉంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



మైసన్నగూడెంలో ప్రభుత్వ భూమిలో నిర్మించిన పొగాకు బ్యారన్‌లు

గ్రామసభలో నా దృష్టికి వచ్చింది : తహసీల్దార్

జంగారెడ్డిగూడెం తహసీల్దార్ స్లీవజోజిని వివరణ కోరగా గ్రామసభకు వెళ్లినప్పుడు తన దృష్టికి వచ్చిందని అయితే ప్రభుత్వ పోరంపోకు స్థలాల విషయం పంచా యతీల పరిధిలో ఉండటం వల్ల సంబంధిత పంచాయతీ సెక్రటరీకి అక్కడ ఆక్ర మణలకు గురికాకుండా ప్లెక్సీలను ఏర్పాటు చేయమని ఆదేశించాను. అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయమన్నట్టు చెప్పారు. పంచాయతీ సెక్రటరీ నాగబాబును వివరణ కోరగా సంబంధిత ప్రభుత్వ భూమిలో ప్లెక్సీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఆంధ్రజ్యోతి అక్కడకు వెళ్లి పరిశీలించగా వాస్తవానికి అక్కడ ఎటువంటి ప్లెక్సీలు లేవు. పైగా నిర్మాణాలు సజావుగా సాగుతున్నాయి. కొత్త నిర్మాణాలను తడిపేం దుకు నీళ్ల ట్రాక్టర్‌లు సైతం అక్కడే ఉన్నాయి. ఈ విషయం తెలిసిన పంచాయతీ అధికారులు సాయంత్రానికి వెంటనే అక్కడ ప్లెక్సీలు ఏర్పాటు చేసినట్టు తెలిసింది.



కొత్తగా నిర్మాణంలో ఉన్న బ్యారన్‌లు

8 ఎకరాల వరకు అన్యాక్రాంతం

మైసన్నగూడెంలో ప్రభుత్వ పోరంబోకు భూములు ఎకరాల మేరకు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు గ్రామంలోని 120/2, 130/2 సర్వే నంబర్లలో సుమారు 34 ఎకరాల రాళ్లగుట్ట పోరంబోకు భూములు ఉన్నాయి. వీటిలో గతంలో ఇందిరమ్మ కాలనీ పేరుతో కొంతమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు.గత ప్రభుత్వంలో జగనన్న కాలనీకి 2.55 ఎకరాలు ఇళ్ల స్థలాల కోసం కేటాయించారు. వీటితో పాటు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు దాదాపు అరెకరం భూమి కేటాయించారు. సోలార్ ప్లాంట్ నిర్మాణానికి 5 ఎకరాలు, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి 2 ఎకరాల వరకు భూమి కేటాయించినట్టు తెలిసింది. అయితే వీటికి సమీపంలో ఉన్న దాదాపు 6 నుంచి 8 ఎకరాల భూమి వరకు అన్యాక్రాంతం అయినట్టు చెబుతున్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్ స్వామిజీ.. హిందుత్వం కోసం పాటు పడుతున్న వారిని సత్కరిస్తున్న సభ్యులు

లోక హితమే హిందూ తత్వం

వాసవీ ప్రపంచ పీఠాధిపతి శ్రీధర్ స్వామి

తాడేపల్లిగూడెంలో ఘనంగా హిందూ సమ్మేళనం

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):విశ్వశాంతి కోసం లోక కల్యాణం కోరుకునేవారే హిందువులు అని వాసవీ ప్రపంచ పీఠాధిపతి శ్రీధర్ స్వామిజీ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో ఎన్‌కే గ్రౌండ్స్‌లో సోమవారం హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిబాషణ చేశారు. విశ్వమానవులుగా ఉన్న మనం పాశ్చాత్య పోకడలు అలవర్చుకుని దిగజారిపోతున్నామన్నారు. ఆ పరిస్థితి నుంచి మళ్లీ తిరిగి రావాలంటే హిందూత్వం అలవర్చు కోవాలని ఆకాంక్షించారు. భగవంతుడు మనకు శరీరం ఇచ్చింది పరోపకారం కోసం అని కానీ అది మరిచి నడుచుకుంటున్నామన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారత కార్యకారిణి సభ్యుడు భాగయ్య మాట్లాడుతూ హిందుత్వాన్ని కోల్పోయి జీవనం కోసం భయపడే పరిస్థితి ఏర్పడిందని హిందువులకు ధైర్యం చెప్పి హిందువులుగా నిలబెట్టేందుకే ఆర్‌ఎస్‌ఎస్ కర్తవ్యంగా భావిస్తోందన్నారు. నేను అనే స్వార్థం వీడి మనము అనే భావన నేర్పించడమే హిందూత్వం అన్నారు. దారాలు కలిస్తేనే చొక్కా అవుతుందని అలాగే హిందువులంతా కలిస్తే హిందూత్వం గెలుస్తుందన్నారు. హిందూ సమ్మేళనం నిర్వహణ కమిటీ అధ్యక్షుడు బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ మాట్లాడుతూ సంఘటితంగా ఉండటం ద్వారానే ధర్మాన్ని కాపాడుకోగలమన్నారు. వృత్తుల ద్వారా కులాలుగా ఏర్పడిన మనం హిందువులుగా ఏకం అవుదామని పిలుపునిచ్చారు. ముందుగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ కుల వృత్తుల్లో ఉంటూ హిందుత్వం కోసం పాటుపడిన సాయికిరణ్, ఝాన్సీరాణి, టి.డేవిడ్‌రాజు, వై హనుమంతరావు, కె.బ్రహ్మానందం తదితరులను ఈ హిందూ సమ్మేళనంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, బీజేపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, బీజేపి రాష్ట్ర కార్యదర్శి భోగిరెడ్డి ఆదిలక్ష్మి, జనసేన నాయకులు బొలిశెట్టి రాజేష్, వర్తనపల్లి కాశీ, తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణ కోసం మహాశాంతి హోమం

ద్వారకాతిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):ద్వారకా తిరుమల చినవెంకన్న గోసంరక్షణ శాలలోని గోవులు ఇటీవలకాలంలో తరచూ మృత్యువాత పడుతుండటంతో దాని నివారణార్థం సోమవారం ఉదయం మహాశాంతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ కారణాలతో ఇటీవల దేవస్థానానికి చెందిన మూడు గోవులు మరణించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఈ మృత్యుదోషం పరిహారం, అలాగే మరల జరుగకూడదని ఆ భగవంతుని వేడుకుంటూ ఈ యాగాన్ని దేవస్థానం ఈవో ఎన్వీసత్యన్నారాయణ మూర్తి ఆదేశాల మేరకు నిర్వహించారు. ఇందులో



భాగంగా ఆలయ గోశాలలో అర్చకులు, పండితులు యజ్ఞకుండాన్ని ఏర్పాటు చేశారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం జరిపారు. తరువాత వాస్తుపూజ చేశారు. హోమకుండంలో అగ్ని ప్రతిష్టాపన నిర్వహించి మహాశాంతి హోమం జరిపారు.



ట్రేపైన పెద్దవే.. లోపల ఇలా..

గుడ్లా .. గోళీలా..?

అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లకు తక్కువ బరువున్న గుడ్లు సరఫరా

పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం

అత్తిలి, డిసెంబరు డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకు 25 రోజులు, పాఠశాలల్లో వారానికి ఐదు రోజుల చొప్పు న కోడి గుడ్డు అందించేందుకు మెనూ రూపొందించారు. సరఫరా చేస్తున్న అట్టల్లో బయట కనిపించే వాటిలో పెద్దవి ఉంచి కింద అట్టల్లో చిన్న వాటిని పెట్టి గుత్తేదారులు బురిడీ కొట్టిస్తున్నారు. కొన్నింటిపై ముద్రలు ఉంటాయి మరికొన్నింటిపై కన్పించడం లేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టర్లు బరువు తక్కువగా ఉన్న కోడి గుడ్లను సరఫరా చేస్తున్నారు. వాటిపై ముద్రలు ఉండడం లేదు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతి నెలా వేల సంఖ్యలో కోడి గుడ్లు సరఫరా చేస్తున్నారు. పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే కోడిగుడ్ల బరువు 45 నుంచి 55 గ్రాములు ఉండాలి. కొన్ని 40 నుంచి 45 గ్రాములే ఉంటున్నాయి. 1.50 కిలోల బరువు ఉండాల్సిన 30 గుడ్ల అట్ట 1.20 కిలోలు మాత్రమే ఉంటుంది. అదే బయట మార్కెట్లో విక్రయిస్తున్న గుడ్లు 70 నుంచి 75 గ్రాముల చొప్పున బరువు ఉంటున్నాయి. మంచి గుడ్లను బయట మార్కెట్‌లో విక్రయించి చిన్న వాటిని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.



శృంగవృక్షం వడ్డీల వీధిలో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిలో పురుగులు, వానపాములు వస్తున్నాయంటున్న మహిళలు.. సరఫరా అవుతున్న మురుగు నీరు

కుళాయిల ద్వారా మురుగునీరు

లబోదిబోమంటున్న శృంగవృక్షం వడ్డీల వారి వీధి వాసులు

పాలకోడేరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : పాలకోడేరు మండలంలోని అతిపెద్ద మేజర్ పంచాయతీ అయిన శృంగవృక్షం గ్రామ వాసులకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిలో మురుగు నీరు వస్తోందని, నీటిలో పురుగులు, వానపాములు కూడా వస్తున్నాయని ఆ ప్రాంత మహిళలు లబోదిబోమంటున్నారు. ఈ పంచాయతీలో ఎప్పుడూ ఏదో మూల తాగునీటి సమస్య ఇబ్బంది ఉంటూనే ఉంటుంది. గత ఏడాదిలో శృంగవృక్షంలోని వడ్డీల వీధిలో కుళాయిల ద్వారా సరఫరా చేసే నీరు తాగి ఆ ప్రాంత వాసులు డయేరియా బారిన పడ్డారు. వారం రోజులపాటు పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అక్కడే ఉండి ఆ ప్రాంతవాసులకు చికిత్స అందించారు . ఆ ప్రాంతంలోని పైపుల్లో సమస్య దొరక్కపోవడంతో ఆ ప్రాంతంలోని కొన్ని వార్డులకు కొత్త పైప్‌లైన్ నిర్మాణం కూడా చేపట్టారు. ఏడాది గడవక ముందే మరోసారి ఆ ప్రాంతంలో ఏమైందో ఏమోగాని కుళాయిలు వదిలిన వెంటనే ముందుగా నల్లటి డ్రెయినేజీ నీరు పైపుల ద్వారా రావడంతో పాటు వానపాములు, చిన్నచిన్న పురుగులు వస్తుండటంతో ఆ ప్రాంత వాసుల్లో మరోసారి భయం మొదలైంది. ఎటువంటి అనారోగ్యాలు వస్తాయోనని లబోదిబోమంటున్నారు. పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులు పట్టించుకుని సురక్షితమైన తాగునీటిని అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇప్పటికే చాలా మంది ఆ నీటిని చూసి భయపడి ఆర్‌వో ప్లాంట్ల నుంచి నీరు కొనుగోలు చేసుకుంటున్నారు.

• సురక్షితమైన నీరు అందించాలి



వీధిలో కుళాయిల ద్వారా మురుగునీరు వస్తోంది. ఎటవంటి అంటురోగాలు ప్రభలుతాయోనని భయమేస్తుంది. పంచాయతీ పాలకులు, అధికారులు మా సమస్యను పట్టించుకుని కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించి ఆరోగ్యాలను కాపాడాలి.

- ఎన్.సోమేశ్వరి, శృంగవృక్షం

• పురుగులు వస్తున్నాయి



కుళాయిల్లో నీరు పట్టుకోవాలంటేనే భయమేస్తుంది. కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిలో వానపాములు, పురుగులు వస్తున్నాయి. ఇప్పటికే ఆ నీరును వాడుకోవడానికే ఉపయోగిస్తున్నాం. తాగడానికైతే డబ్బులు పెట్టి కొనుగోలు చేసుకుంటున్నాం. స్నానాలు చేసేటప్పుడు చిన్న పిల్లలు ఆ నీటిని నోట్లో వేసుకుని ఎక్కడ తాగేస్తారోనని భయమేస్తుంది. అధికారులు సమస్యను కనుగొని తమ బాధను తీర్చాలి.

- ఆర్.పుష్ప, శృంగవృక్షం



పెనుగొండ రాజుగూడెంలో యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన 50 అడుగుల స్టార్

మొదలైన క్రిస్మస్ సంబరాలు

విద్యుత్ కాంతులతో చర్చిలు

పెనుగొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ నెల ప్రారంభం కావడంతో చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఇళ్లపై రంగురంగుల స్టార్స్‌ను వేలాడదీస్తున్నారు. పెనుగొండ మండల గ్రామాల్లో చర్చిలు, ఇళ్లపై పెద్దఎత్తున స్టార్‌లు ఏర్పాటు చేశారు. పెనుగొండ రాజుగూడెంలో లూథరన్ చర్చిలో యూత్ సభ్యులు 50 అడుగుల స్టార్ ఏర్పాటుచేశారు. చర్చిలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. డిసెంబరు 31 వరకు యూత్ క్రిస్మస్, సండే స్కూలు క్రిస్మస్, స్త్రీల క్రిస్మస్ వంటి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తుంటారు. క్రిస్మస్ నెల మొదటి రోజు నుంచి క్రీస్తు రాకను ఆకాంక్షిస్తూ క్రైస్తవ మందిరాలు, ఇళ్లపై స్టార్‌లు ఏర్పాటు చేస్తున్నారు.



వాసవి పెనుగొండగా మార్పు చరిత్రాత్మకం

▸ ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వాసవి పెనుగొండగా మార్పు చరిత్రాత్మకమని, పెనుగొండ పట్టణానికి గౌరవం దక్కిందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం పెనుగొండ టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో పలు సామాజికవర్గాలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ, ఆర్యవైశ్యుల భావోద్వేగాలను గౌరవిస్తూ ప్రభుత్వం వాసవి పెనుగొండగా జీవో జారీచేయడం చరిత్రలో నిలిచిపోయే నిర్ణయం అన్నారు. ఈమేరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. గ్రామంలోని అన్ని పార్టీలు అఖిల పక్షంగా ఈ నిర్ణయాన్ని ఏకగ్రీవంగా ఆమోదించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, కటికిరెడ్డి నానాజీ, రొక్కాల సురేష్, సొసైటీ చైర్మన్‌నక్కా వేదవ్యాసశాస్త్రి, మద్దింశెట్టి వెంకటేష్, బండారు సత్యనారాయణ, బళ్ళ రాంబాబు, గెద్దాడ చిన్న, రాచకొండ నాగేశ్వరరావు, జానకి రామయ్య, కమిడి వెంకటేశ్వర్లు, రాపాక ఆశీర్వాదం, జనసేన నాయకులు కొండవీటి శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూరు, సీపీఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ఒప్పందాలను పత్రాలను చూపిస్తున్న ఎన్వీ రమణారావు, కంపెనీ ప్రతినిధులు

ప్రముఖ కంపెనీలతో ఏపీ నిట్ ఒప్పందాలు

తాడేపల్లిగూడెం అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన వర్సిటీ, హైదరాబాద్‌కు చెందిన మిల్టన్ సోనిక్ డిఫెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలతో తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్ సోమవారం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ జిల్లా ప్రమోషన్ మేనేజర్ టీవీ సూర్యప్రకాశ్‌రావు, ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, మిల్టన్ సోనిక్ డిఫెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ బి.మహేందర్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి ఒకరికొకరు మార్చుకున్నారు. వారు మాట్లాడుతూ బీటెక్ మూడు, నాలుగు సంవత్సరం విద్యార్థులకు, ఎంటెక్ చేస్తున్న విద్యార్థులకు ఈ ఒప్పందాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఏపీ నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్‌శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ వినోత్‌కుమార్‌రాజా కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'క్రీడలతో ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు'


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ, కలెక్టర్

భీమవరంటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు, స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈనెల రెండో వారం నుంచి జనవరి పదో తేదీ వరకు నిర్వహించే క్రీడా సంబరాలు నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారుల నుంచి ఆఫీస్ సబార్డినేట్ వరకు ప్రతి ఒక్కరూ ఈ క్రీడలలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు ముఖ్యంగా మహిళలు తప్పనిసరిగా క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. చెస్, క్యారమ్స్, వాలీబాల్, షటిల్, త్రోబాల్, షాట్ పుట్, కబడ్డీ వంటి విభాగాలలో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం నుంచి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జిల్లాలోని మూడు డివిజన్ల స్థాయిలో పోటీలు జరుగుతాయని, ఎంపికైన వారిని జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దుంపగడప రైల్వే గేటులో నిలిచిన గూడ్స్


రైల్వే గేటులో నిలిచిన గూడ్స్

ఆకివీడు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఆకివీడు నుంచి కైకలూరు మీదుగా వెళ్లే గూడ్స్ రైలు సాంకేతిక లోపంతో దుంపగడప వైపు వెళ్లే రైల్వేగేటులో సోమవారం సుమారు గంటసేపు నిలిచింది. ఈమేరకు ఆ మార్గం మీదుగా ప్రయాణించే వాహనదారులు, పాదచారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమీపంలో ఉన్న సిద్ధాపురం వైపు వెళ్లే రైల్వేగేటు మీదుగా ప్రయాణాలు కొనసాగించారు. మరమ్మతుల అనంతరం గూడ్స్ వెళ్లడంతో రైల్వే అధికారులు గేటు తెరిచారు.

కుమారుడికి 'తల కొరివి' పెట్టిన తల్లి


కుమారుడి మృత దేహానికి తల కొరివి పెడుతున్న కన్నతల్లి సత్యవాణి

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హిందూ సంప్రదాయంలో తల్లిదండ్రులు మరణిస్తే కుమారుడు తలకొరివి పెట్టడం ఆచారం. పాలకొల్లు పట్టణంలో కుమారుడికి తల్లి తలకొరివి పెట్టిన ఘటన జరిగింది. వివరాలివి.. పట్టణంలోని బంగారు వారి చెరువుగట్టు ప్రాంతానికి చెందిన వల్లూరి సత్యవాణి భర్త సుమారు 19 ఏళ్ల క్రితం మరణించగా కుమారుడు, కుమార్తెలతో వంటలు చేసుకుని జీవనం గడుపుతోంది. కుమారుడికి, కుమార్తెకు వివాహాలు చేసింది.. అయితే కుమార్తె మెదడు సంబంధిత వ్యాధితో పదేళ్ల క్రితం మరణించగా కుమారుడు శ్రీనివాస్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నాయి అయితే శ్రీనివాస్ కుటుంబ సమస్యల కారణంగా భార్యతో విడిపోయి తల్లి వద్దనే ఉంటున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిస అయిన శ్రీనివాస్ అనారోగ్యంతో సోమవారం మరణించాడు. అతడికి ఎవరూ లేకపోవడంతో తల్లి సత్యవాణి తన సోదరితో కలిసి స్థానిక హిందూ శ్మశాన వాటికకు కైలాస రథంలో తీసుకువచ్చి కర్మకాండలు నిర్వహించి తలకొరివి పెట్టింది. ఆమెకు స్థానిక వ్యాపారి బోడ చంద్రకుమార్ ఆర్థిక సాయం అందించారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి
DAILY CLASSIFIEDS
క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

FINANCE
గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్ Govt. Reg.No.176/2019. Cell: 9550648668
AJD:244603


కాలనీలోనే రేషన్ ఇవ్వాలంటూ నిర్వాసితుల ఆందోళన

రేషన్ కష్టాలు ఎన్నాళ్లు..?

▸ ప్రతి నెలా వందల కిలో మీటర్ల దూరం వెళ్లి తెచ్చుకుంటున్నాం..

▸ రేషన్, స్థానికత సమస్యలు పరిష్కరించాలని నిర్వాసితుల ఆందోళన

బుట్టాయగూడెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాలనీలకు తరలివచ్చిన నిర్వాసిత గిరిజనులకు ఏళ్లు గడుస్తున్నా రేషన్ కష్టాలు మాత్రం తప్పడం లేదు. దీంతో వారంతా వందల కిలో మీటర్లు వెళ్లి నాలుగేళ్లుగా ప్రతి నెలా రేషన్ బియ్యాన్ని తెచ్చుకుంటున్నారు. ఆందోళన చేసిన ప్రతిసారి త్వరలోనే మీకు రేషన్ బియ్యాన్ని కాలనీలోనే ఇప్పిస్తామంటూ అధికారులు చెప్పడం తప్ప కార్యరూపం దాల్చడం లేదు. ప్రభుత్వం అందించే ఉచిత బియ్యం కోసం నిర్వాసిత గిరిజనులు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. అధికారులు, పాలకుల తీరుపైన మండిపడిన రామన్న గూడెం కాలనీ నిర్వాసిత గిరిజనులు సోమ వారం కమ్యూనిటీ హాలు వద్ద నిరసన తెలిపారు. తమకు కాలనీలోనే బియ్యం ఇవ్వాలని కోరారు. రంపచోడవరం నియోజకవర్గంలోని వీఆర్ పురం మండలం తుమ్మిలేరు పంచాయతీలోని కొండేపూడి, కొల్లూరు, తుమ్మిలేరు, పోచవరం, చొక్కనపల్లి గ్రామాలను ఏలూరు జిల్లా బుట్టా యగూడెం మండలంలోని రామన్న గూడెం సమీపంలో నిర్మించిన కాలనీలకు 2022లో 380 కుటుంబాలను తరలించారు. అయితే అధికారులు వారి రేషన్ కార్డులను మార్పు చేయలేదు. దీంతో తామంతా ప్రతి నెలా వందల కిలోమీటర్లు వాహనాలతో వెళ్లి రూ. 16 వేలు కిరాయి చెల్లించి 1700 కిలోల రేషన్ బియ్యాన్ని తెచ్చుకుంటున్నామని నిర్వాసితులు వేట్ల ముత్యాలరెడ్డి, అందెల సీతారామిరెడ్డి, విన్నెల పోసిరెడ్డి, వాళ్ళ రాజేంద్రరెడ్డి తెలిపారు. రేషన్ బియ్యం కోసం తాము పడుతున్న కష్టాలు అన్ని ఇన్నీ కావని ప్రమాదాలకు గురవుతున్నట్టు తెలిపారు. రేషన్ తోపాటు స్థానికత విషయంలోను ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. అల్లూరి జిల్లాలో చదువులు కొనసాగించిన తమను ఏలూరు జిల్లాలో కలపడం వల్ల స్థానికత సమస్య ఉందన్నారు. ఉద్యోగం, చదువుల విషయంలో నిరాశే ఎదరవుతోందని, అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

5న మెగా పీటీఎం.. భారీ ఏర్పాట్లు

ఏలూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 5న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 3.0 నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు తుది దశకు చేరాయి. గతంలో జరిగిన పీటీఎంలకు భిన్నంగా మరిన్ని అంశాలను చేర్చి నిర్వహిస్తున్నారు. ఆ మేరకు అజెండా అంశాలను విద్యా శాఖ విడుదల చేసింది. విద్యార్థులే స్వయంగా తయారుచేసిన ఆహ్వాన పత్రికలతో తల్లిదండ్రులను, స్థానిక ప్రజాప్రతినిధులను, ఎస్ఎంసీ సభ్యులను, దాతలను, సామాజిక సేవకులను, పూర్వ విద్యార్థులను మెగా పీటీఎంకు ఆహ్వానిస్తున్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు వేర్వేరుగా కార్యక్రమాలను నిర్దేశించారు.

పాఠశాలల్లో సమీక్ష : సమగ్ర శిక్ష ఏలూరు జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్

జిల్లాలోని 27 మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పీటీఎం 3.0 విజయవంతం చేయడానికి కార్యాచరణను హెచ్ఎంలు, ఎంఈవోలకు పంపించాం. పీటీఎం ముగిసిన తర్వాత తల్లితండ్రుల ఫీడ్ బ్యాక్, అభివృద్ధి వ్యూహాలు, అభ్యసన కార్యక్రమాలపై ఫాలో అప్‌ను టీచర్లు సమీక్షిస్తారు. పీటీఎం నిర్వహణలో స్కూలు హెచ్ఎం, టీచర్లు, ఎంఈవోలు, ఎస్ఎంసీ/ పేరెంట్స్ అందరికీ సమాన బాధ్యతలు అప్పగించాం.

కార్యక్రమాలిలా..

ఆ రోజు ఉదయం 9 నుంచి 9.30 గంటల వరకు పాఠశాలకు విచ్చేసే వారికి ఆహ్వానం పలకడం, 10.50 వరకు విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, ప్రవర్తనా శైలిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ముఖాముఖి తెలియజేయడం, ఆడపిల్లల ఆత్మరక్షణకు కరాటే విద్య వంటి కొన్ని వీడియో చిత్రాల ప్రదర్శన ఉంటాయి. ప్రాథమిక పాఠశాలల్లోనైతే బాలబాలికల అభ్యసనా సామర్థ్యాలను మదింపు చేస్తూ దూబచర్ల డైట్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) సర్వేలో నిర్ధారణైన విషయాలను తల్లిదండ్రులకు వివరిస్తారు. ఆ వెంటనే ఉదయం 11 గంటల వరకు ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేసిన ఎఫ్ఎల్ఎన్ లెర్నింగ్ మెటీరియల్, స్పోర్ట్స్ కిట్లు, ఏటీఎల్/ స్టెమ్ ల్యాబ్ పరికరాలు, ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తారు. తదుపరి 11.10 నుంచి 12.45 గంటల వరకు స్కూలులోని ప్రధానవేదికపై కార్యక్రమం ఉంటుంది. విద్యార్థులతో గీతా లాపన, ప్రసంగాలు, విద్యార్థుల సామర్థ్యాలను తెలియజేసే హోలిస్టిక్ రిపోర్టులు, అసెస్‌మెంట్ బుక్‌లెట్ల అందజేత, వాటిపై చర్చ, ప్రశ్నలు-సమాధానాలు, బాలికల తో కరాటే ప్రదర్శనలు ఉంటాయి. మధ్యాహ్నం 12.45 నుంచి మెగా పీటీఎంకు హాజరైనవారికి సహపంక్తి భోజనం ఉంటుంది.

1728 పాఠశాలల్లో మెగా పీటీఎం : ఏలూరు డీఈవో లక్ష్మమ్మ

జిల్లాలో ప్రభుత్వ రంగంలో 1362 ప్రాథమిక, 81 ప్రాథమికోన్నత, 248 ఉన్నత, 37 హైస్కూల్ ప్లస్ పాఠశాలలున్నాయి. వీటిలో మొత్తం 1,16,503 మంది బాలబాలికలు చదువుతున్నారు. వీటన్నింటిలో ఈ నెల 5న ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూలు మేరకు మెగా పీటీఎం 3.0 జరుగుతుంది. దీని నిర్వహణకు సమగ్ర శిక్ష ద్వారా పాఠశాలలకు విడుదల చేసిన కాంపోజిట్ గ్రాంట్ నుంచి 10 శాతం ఖర్చు చేసుకునే వెసులు బాటు కల్పించాం. క్షేత్రస్థాయిలో డీవైఈవోలు, ఎంఈవోలు, సమగ్ర శిక్ష సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ అధికారులు పర్యవేక్షిస్తారు.

ఎయిడ్స్ నివారణే ధ్యేయం కావాలి



ఏలూరులో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ఏలూరు క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నివారణే ధ్యేయంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ అన్నారు. ఎయిడ్స్ డేను పురస్కరించుకుని ఏలూరు లో ర్యాలీ ప్రారంభించారు. లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లడుతూ రాబోయే రోజుల్లో ఎక్కువ హెచ్ఐవి పరీక్షలు చేసే విధంగా ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నామన్నారు. జిల్లా జైల్ సూపరింటెండెంట్ సిహెచ్ఆర్‌వి స్వామి, ఐసీటీసీ, ఎఆర్‌టి, డీఎస్ఆర్‌సి, హెచ్‌సీ, స్వచ్ఛంద సంస్థల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సిబ్బందిని సత్కరించారు. డీఐఓ డాక్టర్ శోభ, డాక్టర్లు సత్య నారాయణ, బ్యేల ఫ్లారెన్స్, ఎం. శ్రీనివాస్, నజరేన్, దిశ జిల్లా సూపర్‌వైజర్ ఎ హరినాధ్ కుమార్, జిల్లా ఎం అండ్‌ఈ, అధికారి సామర్ల విజయలక్ష్మి, షేర్ ఇండియా పీవోజి జగదీష్, ప్రిజన్ కో ఆర్డినేటర్ కె. వినోద్ కుమార్, డీఆర్పీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు అడ్డంగా వున్న వాహనాలను తరలిస్తున్న పోలీస్ వాహనం


బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ, ఎస్పీ

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

ఏలూరు క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో సోమవారం సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌లు స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగిన భద్రతా చర్యలు చేపట్టారు. వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో ప్రతి ఒక్కరినీ మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు నిర్వహించి అనుమతించారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం ముఖ్యమంత్రి పర్యటించిన అన్ని ప్రాంతాల్లో బందోబస్తుతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ కమాండ్ కంట్రోల్ నుంచే సంబంధిత అధికారులకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల రాష్ట్రంలో జిల్లాలో జరిగిన పరిణామాల దృష్ట్యా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి అదనపు సిబ్బందిని ఈ బందోబస్తుకు వినియోగించి బహుళ భద్రతను ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల పొలాలు, వివిధ ప్రాంతాలను డ్రోన్ కెమెరాలతో గస్తీ నిర్వహించారు. అధికారులు సమర్థవంతంగా విధులను నిర్వర్తించి ముఖ్యమంత్రి పర్యటనలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సమర్థవంతంగా విధులను నిర్వర్తించడంతో ఉన్నతాధికారులు సిబ్బందిని, బందోబస్తులో పాల్గొన్న అధికారులను అభినందించారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు


చెస్ పోటీల్లో విజేతలు

ఏలూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అన సూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ స్కూల్లో ఇంటర్నేషనల్ స్టేట్ ఓపెన్ రాపిడ్ చెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అకాడమీ డైరెక్టర్ మాదాసు కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలను సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాల మాజీ డైరెక్టర్ కోనేరు సిద్ధార్థ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 113 మంది హాజరై ప్రతిభ కనబరిచారు. పోటీల్లో డి. లక్ష్మణరావు (ప్రథమ), జి. అభిషేక్ అబ్రహం (ద్వితీయ), జే. అక్షిత్ (తృతీయ) ఎ. శ్రీకాంత్ నాలుగు, బి. శ్రీనివాస్ ఐదో స్థానం సాధించారు. విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఏజీసీఏ డైరెక్టర్ జి. యోహనన్, ఆర్బిటర్ కాశీ పర్యవేక్షించారు.


చికిత్స పొందుతూ మృతి చెందిన రాజేష్ (ఫైల్)


రాజమండ్రిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుంచె శ్రీను

బొలెరో బోల్తా ఘటనలో మరోవ్యక్తి మృతి

స్వగ్రామానికి మృతదేహాలు.. దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం గ్రామాల్లో విషాద ఛాయలు

యలమంచిలి/పోలవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):యలమంచిలి మండలం దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం గ్రామాల నుంచి ఆదివారం 15 మంది గండిపోశమ్మ అమ్మవారి ఆలయానికి బొలెరో వ్యానులో వెళ్లారు. తిరిగి వస్తుండగా వ్యాను అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో దొడ్డిపట్లకు చెందిన గెద్దాడ రాజేష్(35) ఆదివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అబ్బిరాజుపాలెం గ్రామానికి చెందిన కాండ్రేగుల నరసింహమూర్తి (37) ఘటనా ప్రాంతంలోనే మృతిచెందాడు. వీరి మృతదేహాలను సోమవారం సాయంత్రం వారి స్వగ్రామాలకు తరలించారు. దర్శనానికని వెళ్లి.. మాకు దూరమైపోయావా అంటూ మృతదేహాల వద్ద వారి కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు కలచివేసింది. నరసాపురం ఆర్డీవో దాసిరాజు గ్రామాలకు కుటుంబసభ్యులను పరామర్శించారు. తీవ్రంగా గాయపడిన కుంచె శ్రీను రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రులైన మరో ముగ్గురు రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలోనూ, ఐదుగురు పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. స్వల్ప గాయాలైన ముగ్గురు వ్యక్తులు వారి ఇళ్లకు చేరుకున్నారు. బొలెరో వ్యాను డ్రైవరు దేవీపట్నం పోలీసుస్టేషన్‌లో విచారణలో ఉన్నారు.

పామాయిల్ గెలలు కోస్తూ విద్యుదాఘాతంతో మృతి


మృతుడు చిన్నరాటాలు

పెదవేగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం కూచింపూడికి చెందిన దిమ్మిటి చిన్న రాటాలు పామాయిల్ గెలలు నరికే పనికి వెళ్తుంటాడు. సోమవారం ఉదయం పెదవేగి మండలం రామశింగవరంలో 20 అడుగుల పొడవైన అల్యూమినియం పైపుతో పామాయిల్ గెలలు కోస్తుండగా అదుపు తప్పి పైపు విద్యుత్ వైర్ల (కండక్టర్)పై పడింది. దీంతో విద్యుత్ ప్రవహించి చిన్నరాటాలు (37) అక్కడికక్కడే మృతి చెందాడు. పెదవేగి ఎస్ఐ కె.రామ కృష్ణ మృతదేహాన్ని పరిశీలించారు. మృతునికి భార్య జ్యోతి, పదో తరగతి, డిగ్రీ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉప్పుటేరులో వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

మొగల్తూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):కూటికోసం ఉప్పుటేరులో వేటకు వెళ్లిన మత్యకారుడు మృతి చెందాడు. పాతపాడు గ్రామానికి చెందిన కొక్కిరగడ్డ శ్రీను(40) ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో గ్రామంలోని ఉప్పుటేరులో వేటకు వెళ్లాడు. సోమవారం ఉదయం ఉప్పుటేరులో మృతి చెంది ఒడ్డుకు వచ్చాడన్నారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ సుబానీ తెలిపారు.

సరిహద్దు గొడవ.. కొట్లాట కేసులో ఇద్దరికి జైలు

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):సరిహద్దు గొడవల్లో కొట్లాటకు వెళ్లి ఒకరిని గాయపరిచిన ఇద్దరికి 15 నెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తాడేపల్లిగూడెం అడిషినల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సోమవారం తీర్పునిచ్చారు.రూరల్ ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం 2018లో అప్పారావుపేటలో అడపా వెంకటేష్‌పై వారి బంధువులైన అడపా నారాయణ, అడపా విష్ణులు దాడి చేశారు. కేసు విచారణ అనంతరం నారాయణ, విష్ణులకు 15 నెలల జైలు, 5 వేల జరిమానా విధించారు.

క్రైం కార్నర్

మద్యం మత్తులో తల్లిపై దాడి

భీమవరం క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :మద్యం మత్తులో కన్నతల్లిని కుమారుడు గాయపర్చిన ఘటన ఇది. భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గతనెల 30వ తేదీన శీలం మంగాయమ్మను ఆమె కుమారుడు ముత్యాలు తలపై గాయపర్చగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగాయమ్మను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెనుమంట్ర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):పెనుమంట్ర మండలం మల్లిపూడి గ్రామానికి చెందిన గుడిమెట్ల సాయిబాబా రెడ్డి (25) ఆదివారం సాయంత్రం పెనుమంట్ర ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పెనుమంట్ర ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. గత నెల 26న తండ్రి శ్రీనివాసరెడ్డి కొడుకును మందలించడంతో మనస్థాపానికి గురైన కుమారుడు కలుపు మందు సేవించి అపస్మారక స్థితిలో వెళ్ళడంతో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటనపై పెనుమంట్ర ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మోటారు సైకిళ్లు ఢీ .. ఒకరికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రెండు మోటారు సైకిళ్ళు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక మోటారు సైకిలిస్టు తీవ్ర గాయాలకు గురయ్యాడు. దెందులూరు మండలం తిమ్మాపురానికి చెందిన గురజాల సత్యనారాయణ (21) తన మోటారు సైకిల్‌పై వెళ్తుండగా సూరప్పగూడెం వద్ద ఎదురుగా వస్తున్న దెందులూరు మండలం కండ్రిగనర్సింగపురం గ్రామానికి చెందిన కనికళ్ళ అంబేద్కర్ మోటారు సైకిల్‌తో ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గురజాల సత్యనారాయణకు తీవ్ర గాయాలవగా అంబేద్కర్ స్వల్ప గాయాలపాలయ్యాడు. వీరిద్దని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అంబేద్కర్‌ను ఔట్ పేషెంట్‌గా పంపించగా సత్యనారాయణను ఆసుపత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బాలిక ఆత్మహత్యపై విచారణ జరపాలి

ఏలూరు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇటీవల పదో తరగతి విద్యార్థిని కావ్య ఆత్మహత్యపై ప్రత్యేక దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ దళిత ప్రజా సంఘాల నాయకులు ఏలూరు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం అందజేశారు. కావ్యది ఆత్యహత్యకాదని స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు బాలికను చదువు విషయంలో అవహేళన చేసి మానసికంగా కుంగ తీశారని ఆరోపించారు. శారీరకంగా కొట్టి హింసించారని ప్రజా సంఘాల దర్యాప్తులో తెలిసిందన్నారు. ఇదే విషయాన్ని ప్రశ్నించిన ప్రజాసంఘాల నాయకులు 25 మందిపై జంగారెడ్డిగూడెం సీఐ, ఎమ్మార్వో తప్పుడు కేసులు పెట్టారు. సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. కేవీపీఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, సీపీఐ ఎంఎల్ ప్రజా పోరాట సమితి ప్రధాన కార్యదర్శి కలింపూడి సుందర్రావు, పీడీఎస్‌యు ఏలూరు జిల్లా కార్యదర్శి కాకి నాని, దళిత నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ బావి ఆక్రమణపై ఫిర్యాదు

చింతలపూడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లి మెయిన్‌రోడ్డు పక్కన పంచాయతీ బావి ఆర్‌అండ్‌బి స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్టు సీపీఐ మండల కార్యదర్శి టి.బాబు పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పంచాయతీకి చెందిన బావి, దీంతోపాటు కొంత ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ముస్లిం వ్యక్తి ఆక్రమించాడని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

పోస్టుమేన్ ఘరానా మోసం

▸ డిపాజిటర్ల సొమ్ము రూ.50 లక్షలతో అదృశ్యం

▸ ఉంగుటూరు సబ్ పోస్టాఫీసులో వెలుగుచూసిన అవినీతి

▸ నిందితుడు శేఖర్‌ది ఏలూరు జిల్లా పెదపాడు

▸ కొనసాగుతున్న ఖాతాల తనిఖీలు


ఖాతాదారుల పాస్ పుస్తకాలను తనిఖీ చేస్తున్న గుడివాడ సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విజయ్

ఉంగుటూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా ఉంగుటూరు సబ్ పోస్టాఫీసులో పనిచేస్తున్న పోస్టుమేన్ ఘరానా మోసానికి పాల్పడ్డాడు. డిపాజిటర్ల సొమ్ము రూ.50 లక్షల వరకు తీసుకుని పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోస్టల్ విజిలెన్స్ అధికారులు ఖాతాల తనిఖీలు ప్రారంభించారు. నిధుల స్వాహా నిజమేనని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పన్నెండేళ్లుగా పనిచేస్తున్న పోస్టుమేన్ శేఖర్ తమని నమ్మించి ముంచాడని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. ఉంగుటూరు సబ్ పోస్టాఫీసులో ఏలూరు జిల్లా పెదపాడుకు చెందిన కె.శేఖర్ (37) 12 ఏళ్లుగా పోస్ట్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. నిత్యం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఉత్తరాలను బట్వాడా చేస్తూ అందరినీ వరసలతో పిలుస్తూ పరిచయాలు పెంచుకున్నాడు. అనతి కాలంలోనే గ్రామస్థులందరికీ నమ్మకస్తుడిగా మారాడు. కూలీనాలీ చేసుకునే పేదలను టార్గెట్‌గా చేసుకున్న శేఖర్ తరచూ వారి ఇళ్లకు వెళ్లి పోస్టాఫీసు పథకాలపై అవగాహన కల్పించేవాడు. పోస్టాఫీసులో ఎంతో కొంత డబ్బును నెలనెలా పొదుపు చేసుకుంటే భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడుతుందని నచ్చచెప్పి వారిని పొదుపు బాట పట్టించాడు. అతడి మాటలను నమ్మిన కొంతమంది మహిళలు తమ అకౌంట్ పుస్తకాలతో పాటు క్రమం తప్పకుండా కట్టాల్సిన సొమ్మును పోస్టాఫీస్‌లో జమచేయమని శేఖర్‌కు ఇచ్చేవారు.శేఖర్ ఆ డబ్బును జమ చేయకుండా చేశానని నమ్మబలికాడు. కొంత కాలం డిపాజిట్లను కట్టించుకుని, తన దగ్గర డిపాజిటర్లు ఉంచిన 300 పాస్ పుస్తకాలు, డిపాజిటర్లు కట్టిన నగదును తీసుకుని గత నెల 25వ తేదీన అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి శేఖర్ తమ దగ్గరకు రాకపోవటం, కనిపించకపోవటంతో ఖాతాదారులకు అను మానం వచ్చి విచారించగా అసలు విషయం తెలిసింది. నిధుల గోల్‌మాల్‌పై గుడివాడ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ భూక్యా విజయ్ నేతృత్వంలోని విజిలెన్స్ బృందం రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. గత నెల 25 నుంచి పోస్టాఫీసులో తనిఖీలు ప్రారంభించింది. డిపాజిటర్లను పాస్‌పుస్తకాలతో సహా పోస్టాఫీసుకు వచ్చి బ్యాలెన్స్ సరిచూసుకోవాలని గ్రామంలో మైక్ ప్రచారం ద్వారా చైతన్యపరిచింది. కస్టమర్ల సమక్షంలో పాస్ పుస్తకాల్లో బ్యాలెన్స్, పోస్టల్ అకౌంట్‌లో నమోదైన బ్యాలెన్స్ సరిచూసే ప్రక్రియ వేగవంతం చేసింది. పోస్ట్‌మాస్టర్ కె.దేవేందర్‌రావు పనితీరుపై ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం జరిపిన ప్రాథమిక తనిఖీల్లో సుమారు రూ.5 లక్షల మేర ఫ్రాడ్ జరిగినట్లు గుర్తించామని, పోస్టమేన్ శేఖర్ చేసిన నిర్వాకం, అవకతవకల్లో పోస్ట్‌మాస్టర్ పాత్ర ఉందని తేలితే ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ తెలిపారు.

గంగానమ్మ జాతర నిర్వహణపై సూచనలు

ఏలూరు రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెల తీర్చే కల్వవల్లి గంగానమ్మ తల్లి జాతరను పురస్కరించుకొని పలువురు ఆధ్యాత్మిక గురువులు నియమాలు సూచించారు. హిందూ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం గంగానమ్మ జాతర చరిత్ర, విశిష్టత,ప్రజలు పాటించాల్సిన నియమాలు, జాతరను ఎలా జరుపుకోవాలనే విశేషాలపై ఆధ్యాత్మిక ప్రసంగం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇరదల ముద్దుకృష్ణ, మజ్జి సూర్యకాంతరావు, వేణుగోపాల్ లూనాని, వివి బాలకృష్ణారావు పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు పటిష్టానికి పనులు ప్రారంభం

ఏలూరుటూటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరప్రజలకు తాగునీరందించే సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు లీకేజీ పనులను నగర కమిషనర్ భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబులు ప్రారంభించారు. గత ఏడాది సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు చెరువుకు గండిపడింది. తాత్కాలికంగా యుద్ధప్రాతిపదికన ఆ గట్టును నగరపాలక సంస్థ సిబ్బంది పూడ్చారు. ప్రస్తుతం 1.94కోట్ల రూపాయల అంచనాలతో గట్టు పటిష్టానికి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏంఈ సురేంద్రబాబు, డీఈలు నారాయణరావు, సాయి పాల్గొన్నారు.

రేపు నల్లజర్లకు రానున్న సీఎం చంద్రబాబు

రాజమహేంద్రవరం/నల్లజర్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతన్నా-మీకోసం కార్యక్రమంలో భాగంగా నల్లజర్ల రానున్నారు. ఈ నేపథ్యంలో సమయం తక్కువగా ఉండడంతో అధికార యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్‌తో కలిసి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహకిశోర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు వేగవంతం చేయాలని, పర్యటన విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత తొలిసారి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్నారని, ముఖ్యంగా రైతుల కోసం వస్తున్నారని అన్నారు. సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేష్ మాట్లాడుతూ సీఎం పర్యటన విజయవంతానికి అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

జనార్దన స్వామి ఆలయానికి రూ.2 కోట్లు మంజూరు



ఏలూరుటూటౌన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): అగ్రహారంలోని శ్రీజనార్ధనస్వామి శ్రీనగరేశ్వర కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల ఆలయాల పునఃనిర్మాణానికి సీఎం చంద్రబాబు రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే చంటి తెలిపారు. గత నెల 28న ఎమ్మెల్యే చంటి సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే చంటి కలిసి పురాతన ఆలయాలకు గురించి వివరించి వాటి పునఃనిర్మాణానికి రూ.4 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన సీఎం చంద్రబాబు దేవాలయాల అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేయాలని దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఆదేశాలు జారీ చేశారు. దేవాలయానికి రూ.2 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బడేటి చంటిని నగరానికి చెందిన ఆర్య వైశ్యులు అభినందించారు. అభినందించినవారిలో దివ్వెల జయబాబు, రామకృష్ణరావు, ఎం.సత్యకుమార్, డి.నరసింహరావులు ఉన్నారు.

ఏయూ ఫార్మసీ పోటీల్లో సీఆర్ఆర్ విద్యార్థిని ప్రతిభ

ఏలూరు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా విశ్వవిద్యాల యం శతాబ్ది ఉత్సవాలను పురస్కరిం చుకుని ఏయూ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల, ఇండియన్ ఫార్మా స్యూటికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో ఏలూరు సీఆర్ఆర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులకు బహుమతులు లభించాయి. ఇన్నోవేటివ్, ఇంటిగ్రేట్, ఇండివీ డ్యూలైజ్ ప్రధానాంశంగా క్లినికల్ ఫార్మకాలజీ, క్లినికల్ ఫార్మసీ ఫర్ నెక్స్ట్ జనరేషన్ ఉప అంశాల్లో నిర్వహించిన ఈ-పోస్టర్ ప్రజంటేషన్ పోటీలో ఫార్మ్ డి 4వ సంవత్సరం విద్యార్థిని ఎం.తేజశ్రీ యూనివర్సిటీ ప్రథమ బహుమతిని గెలుచుకుందని కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.నరేంద్రబాబు తెలిపారు. మొత్తం 12 మంది కళాశాల ఫార్మసీ విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారని వివరించారు. వీరిని విద్యా సంస్థల కార్యదర్శి మాగంటి ప్రసాద్, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు ఉషశ్రీ, ఫరీన్ మాలిక్ అభినందించారు.

కొత్త బస్టాండ్ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా గొల్లపల్లి

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో సోమవారం కొత్త బస్టాండ్ ఫ్రెండ్స్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగింది. ముగ్గురు అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. గుర్రం గుర్తుపై పోటీ చేసిన గొల్లపల్లి హనుమంతరావు గెలుపొందారు. ఆయనకు 45 ఓట్లు రాగా ఏనుగు గుర్తుపై పోటీ చేసిన ప్రత్యర్థి జిల్లారపు వెంకటేశ్వరరావుకు 23 ఓట్లు వచ్చాయి. దీంతో 22 ఓట్ల మెజార్టీతో హనుమంతరావు విజయం సాధించారు. ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు నాయకత్వంలో పోలింగ్ సక్రమంగా నిర్వహించారు. ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, శ్రీనివాసరావు, లీలాకృష్ణ పాల్గొన్నారు.

నేనున్నానని..

(5వ పేజీ తరువాయి)

ముచ్చటించారు. అలాగే సీఎం ఉంగుటూ రుకు వరాల జల్లు కురిపించారు. నల్లజర్ల రోడ్డు విస్తరణ, ఇంటర్ కాలేజీ భవనాలు, గురుకుల పాఠశాల భవనాల నిర్మాణంతోపాటు చింతలపూడి ఎత్తిపోతల పూర్తికి చర్యలు తీసుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. నల్లమాడులో సీసీ రోడ్లు, మరుగుదొడ్లు ఇతర పనులను పూర్తి చేయడానికి కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

హార్టికల్చర్ అసిస్టెంట్‌కు చంద్రబాబు క్లాస్

నల్లమాడులో ఇళ్లు, ఇతర వివరాలను ప్రకటించిన హార్టి కల్చర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్‌కు చంద్రబాబు క్లాస్ తీసు కున్నారు. పంటల సాగు వివరాలు, టాయిలెట్లు, ఇళ్ల తది తర వివరాలపై పొంతన లేని లెక్కలు చెప్పడంపై ఏం ప్రిపేర్ అయ్యి వచ్చావా అంటూ ప్రశ్నించారు. పామాయిల్ సాగు విస్తీర్ణంలో ఉత్పాదకత పెంచడానికి ఏం చర్యలు తీసుకున్నావని అడగ్గా నీళ్లు నమిలారు. ఒక ప్రణాళిక ప్రకారం పంటల సాగులో రైతులను ముందుకు నడపించాలి. మళ్లీ వస్తా.. అప్పటికే రైతులకు పంటలపై తగు సలహాలు, సూచనలు ఇచ్చి సంసిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాల వృద్ధి రేటులో జిల్లా ఐదో స్థానంలో ఉందని, మూడో స్థానానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. సీఎం పర్యటనలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారధి, జెడ్పీ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ,ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, బడేటి చంటి, మద్దిపాటి వెంకట్రాజు, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే మురళీ, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కిశోర్, జేసీ ఎంజే అభిషేక్ గౌడ, జెడ్పీ సీఈవో శ్రీహరి, సీపీవో వాసుదేవరావు పాల్గొన్నారు.

ఐదు గంటలపాటు వడివడిగా

- సీఎం చంద్రబాబు ఐదు గంటలపాటు ఉంగుటూరు మండలంలో పర్యటించారు.
- ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన ఆయన ఉదయం 11.40 గంటలకు నల్లమాడు చేరుకున్నారు. అక్కడ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు.
- రోడ్డు మార్గాన గోపీనాథపట్నం వెళ్లి అక్కడ కిడ్నీ బాధితురాలు నాగలక్ష్మికి పింఛన్ పంపిణీ చేసి తిరిగి నల్లమాడులోని సభా ప్రాంగణానికి చేరుకున్నారు.
- అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను 25 నిమిషాలపాటు ఆసక్తిగా తిలకించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.
- మధ్యాహ్నం 12.50 గంటలకు ప్రజావేదిక పైకి వచ్చి గంటా పది నిమిషాలపాటు ప్రసంగించారు.
- అనంతరం ఉంగుటూరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశమై వారికి దిశా నిర్దేశం చేశారు.
- సాయంత్రం 4.50 గంటలకు హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరారు.

సీఎం సభలో పనిచేయని మైక్‌లు

నిడమర్రు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):సీఎం సభలో మైకులు సరిగా పనిచేయకపోవడంతో కలెక్టర్ వెట్రి సెల్వి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లమాడు ప్రజావేదిక మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టర్ ప్రారంభోపన్యాసంతో సభ ప్రారంభమైంది. మైక్ సరిగా పనిచేయక ఆమె మాటలు ఎవరికి సరిగా వినిపించలేదు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతున్న సమయంలో కార్డ్‌లెస్ మైక్ పనిచేయకపోవడంతో ఆయన అసహనానికి గురయ్యారు. దీంతో వైరు మైక్‌తో మాట్లాడాల్సి వచ్చింది. ఆ తర్వాత మాట్లాడిన ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులుకు ఇదే పరిస్థితి ఎదురవడంతో ఇబ్బందిపడ్డారు. వెంటనే కలెక్టర్ వెట్రిసెల్వి వేగంగా స్టేజి దిగి మైక్ సెట్టింగ్ పాయింట్ వద్దకు వచ్చి సంబంధిత అధికారిపై మండిపడ్డారు. ఇదేమిటని నిలదీశారు. తక్షణం మైక్ సరిచేయాలని ఆదేశించడంతో ఐదు నిమిషాల్లో సమస్య పరిష్కారమైంది. తర్వాత కార్డ్ లెస్ మైక్‌లు పనిచేయడంతో సీఎం సభకు ఎలాంటి ఆటంకం కలగలేదు.

కూటమి కార్యకర్తలతో గొడవలొద్దు

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర అభివృద్ధికి మన ప్రభుత్వం మళ్లీ రావాలి. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కంచుకోట.. కార్యకర్తలు అలగవద్దు' అంటూ ఆయన సుతిమెత్తగా హెచ్చరించారు. మారిశెట్టి ప్రసాద్, ముత్యాల స్వామి, సత్తినీడి నాని, పొత్తూరి నరసింహరాజు, రుద్రరాజు కొండయ్య, గఫ్ఫార్‌ఖాన్, వేముల పల్లి సుధీర్, కడియాల రవిశంకర్, పాతూరి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోలవరంలో బొరగం, తాడిచర్లలో మాజీ ఎమ్మెల్యే ఘంటా, కవ్వగుంటలో ఎమ్మెల్యే చింతమనేని, ధర్మాజీగూడెంలో ఎమ్మెల్యే రోషన్ పింఛన్లు అందజేస్తున్న దృశ్యం

ఇంటి వద్దకే పెన్షన్

● స్వయంగా వెళ్లి అందజేసిన ఎమ్మెల్యేలు ● తెల్లవారు జాము నుంచే కొనసాగిన పంపిణీ

ఏలూరు టూటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.సోమవారం తెల్లవారు జామున ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే చంటి పింఛన్లు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ధైర్యం చెప్పి పింఛన్లు అందజేశారు.ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పింఛన్లు 1వ తేదీనే అందజేస్తామని అన్నారు. అనంతరం 2వ డివిజన్‌లో ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీ చేపట్టారు. రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు,ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారధి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, కార్పొరేటర్ నరసింహరావు, అమరావతి అశోక్, గంగాధరరావు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: సామాజిక న్యాయం సాధించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని మండలంలోని అన్ని ప్రాంతాల్లో కూటమి నేతలు పాల్గొని అర్హులకు అందజేశారు. మండలంలోని మారంపల్లిలో ఎమ్మెల్యే మద్దిపాటి కూటమినేతలతో కలిసి పింఛన్లు పలువురికి అందించారు. మారంపల్లి సర్పంచ్ పాతూరి రాధలక్ష్మి నాయకులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం రూరల్: వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువలకు సీఎం చంద్రబాబు పెద్ద కుమారుడిగా నిలుస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. మండల రైతు అధ్యక్షులు ఎలికే వర ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి రాగాని శ్రీనివాసరావు, కార్యదర్శి తడికల దావీదు, మండల బీసీసెల్ ప్రధాన కార్యదర్శి రాగాని రామకృష్ణ, పులపాకుల ప్రసాద్, దాసరి లోకేష్, వెంకట్ పాల్గొన్నారు.

● దెందులూరు: మండల వ్యాప్తంగా పింఛన్లు 9,368 ఉండగా అందులో ఉదయం 6 గంటల నుంచే 8 వేల 300 మందికి అందించినట్టు ఎంపీడీవో కె.వీరప్రతాప్, డిప్యూటీ ఎంపీడీవో భీమరాజు తెలిపారు. ఉదయం 6 నుంచి అధికారులతో కలిసి టీడీపీ నాయకులు, బ్యాంక్ అధ్యక్షుడు యలమర్తి శ్రీనివాస్, తెలుగు యువత అధ్యక్షుడు మోతుకూరి నాని బాబుతో పాటు పలువురు గ్రామాల్లో ఇంటికి వెళ్లి పింఛన్లను అందించారు. మండలంలో 93 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.

● లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెంలో సోమవారం పింఛన్ల పంపిణీని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ప్రారంభించారు. వృద్ధులు, దివ్యాంగుల వద్దకు ఎమ్మెల్యే వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లింగపాలెం మండలంలో 7,820 మంది లబ్ధిదారులకు రూ.3కోట్ల 41లక్షల 88 వేలు పెన్షన్ల రూపంలో అందిస్తున్నామన్నారు. ఎంపీడీవో కె.వాణి పాల్గొన్నారు.

● పోలవరం: పింఛను సొమ్ములు నేరుగా లబ్ధిదారులకు అందించడం సీఎం చిత్తశుద్ధికి నిదర్శనమని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. పోలవరం మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందించారు. టీడీపీ మండల అధ్యక్షులు మంగిన కొండ, కూటమి నేతలు నునకాని రాంబాబు, గునపర్తి చిన్ని, కొణతాల ప్రసాద్, ఆకుల రాజా, నల్లా రాంబాబు, పూడి వీరవెంకట సత్యనారాయణ, బెజవాడ గోపి పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండలంలో పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా జరిగింది. తాడిచర్లలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, టీడీపీ మండలాధ్యక్షులు కిలారు సత్యనారాయణ, సర్పంచ్ పసుమర్తి పార్థసారథిబాబు, వేముల హనుమంతు పాల్గొన్నారు. పాతూరు గ్రామంలో సర్పంచ్ కరిపోతు అనూష, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్‌బాబు, మాజీ ఉప సర్పంచ్ నెక్కలపు సూర్యనారాయణ,డాన్ దివాకర్, గోధుమ మధు, మల్లెల్లి కాంతారావు, కోనేరు జయకృష్ణలు పాల్గొన్నారు. గుంటుపల్లిలో జరిగిన పెన్షన్ల పంపిణీలో కూటమి నాయకులు బేతిన వెంకట్రావు, కంఠమనేని అంజిమూర్తి, గోరింక దాసు పాల్గొన్నారు. ఆడమిల్లిలో సర్పంచ్ గూడపాటి కేశవరావు, జిజ్జూరి బాబ్జీ, తడికలపూడిలో సొసైటీ చైర్మన్ తూతా కుమార్, మాజీ సర్పంచ్ మేరుగు సుందరరావు, బొంతు వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు. రామన్నపాలెంలో కూటమి నాయకులు మద్దిపోటి నాగేశ్వరరావు బృందం పాల్గొన్నారు.

● పెదవేగి: సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ సోమవారం తెల్లవారు జాము నుంచే ప్రారంభమైంది. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పెదవేగి మండలం వంగూరు, కవ్వగుంట, జగన్నాథపురం గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్లు ఎంతోమందికి జీవనాధారమయ్యాయన్నారు.పెదవేగి మండలంలో సామాజిక పింఛన్లు మొత్తం 11,783 ఉన్నాయి. మధ్యాహ్నం 12గంటల నాటికి 83శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని పెదవేగి ఎంపీడీవో నాగేంద్రకుమార్ తెలిపారు.

పోరాటానికి భవన నిర్మాణ కార్మికులు సిద్ధం

బుట్టాయగూడెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగం కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు కె.వి.రమణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 1 నుంచి 14 వరకు ప్రచార ఆందోళనలు చేపట్టాలనే గోడప్రతులను దొరమామిడిలో సోమవారం విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారని నేటికి అమలు జరగలేదన్నారు. జి.చిన్నారెడ్డి, ఎం.నారాయణస్వామి, పి.రాజేశ్, సుబ్బారావు, సురేష్, శ్రీను, రవి, ఏసు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

కుక్కునూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు పోక్సోచట్టం, సైబర్ నేరాలపై కుక్కునూరు ఎస్.ఐ. రాజారెడ్డి అవగాహన కల్పించారు. మంచి, చెడు స్పర్శ మధ్య తేడాను గుర్తిండం, ఎవరైనా వేధించిన, బెదిరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు తెలియజేయడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించారు. పిల్లలు ధైర్యంగా తమ సమస్యను తెలియజేయాలన్నారు. స్మార్ట్‌ఫోన్ల వినియోగం, సోషల్ మీడియా వాడకం పెరిగిన నేపధ్యంలో సైబర్ నేరాల గురించి బాలికలను ఎస్.ఐ. అప్రమత్తం చేశారు. ఏదైన సమస్య వస్తే 112,1098 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీటీఏ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ)జిల్లా శాఖ నూతన కార్యవర్గానికి సోమవారం ఏలూరులో ఎన్నికలు జరిగాయి. రెండేళ్ల కాల పరిమితికి సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి. వెంకటేశ్వరరావు, జి.వెంకట రమణ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.ఆనందరాజు, సలహాదారుడిగా కె.డి.సమర్పణరావు, కోశాధికారిగా బి.కృపాకిరణ్, అసోసి యేట్ అధ్యక్షులుగా సి.హెచ్.ధర్మలింగం, వి.ధనకాంత, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కె.రాజు, వి.జేసుదాసులను ఎన్నుకున్నారు. అదనపు ప్రధాన కార్యదర్శులుగా పి.శ్రీనివాసరావు, జి.రామదాసు, డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా పి.రాంబాబు, సి.హెచ్.విమల, మహిళా విభాగం కార్యదర్శిగా కె.రాజశ్రీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి.బాలస్వామి, రాష్ట్ర కౌన్సిలర్లుగా బి.మనోజ్ కుమార్, పి.సాల్మన్, బి.రామరావు, బి.సాయిరాజు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ కుమార్, పరిశీలకుడిగా బి.రామారావు వ్యవహరించారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో

నాణ్యమైన భోజనం అందించాలి

పెదపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని, అలాగే భోజనం నాణ్యతలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా తగిన జాగ్రత్తలు వహించాలని పెదపాడు ఎంఈవో సబ్బితి నరసింహమూర్తి తెలిపారు. పెదపాడు జడ్పీ హైస్కూల్‌ను ఎంఈవో నరసింహమూర్తి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, హెచ్.ఎం. వెంకటేశ్వరరావుతో కలిసి భోజనం చేశారు. ఎంఈవో నరసింహమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



నూతన కాటాను ప్రారంభిస్తున్న దృశ్యం

రైతుల కోసం నూతన కాటా ఏర్పాటు

టి.నరసాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ రైతుల సౌకర్యార్థం నూతన కాటా ఏర్పాటు చేసినట్టు జంగారెడ్డిగూడెం ఏరియా నవ భారత్ పామ్ ఆయిల్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు, మక్కినవారిగూడెం సొసైటీ ఛైర్మన్ పర్సన్ ఆచంట సూర్యనారాయణ తెలిపారు.బండివారిగూడెంలో నవ భారత్ కంపెనీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాటాను సోమవారం ఆయన ప్రారంభించారు. మక్కినవారిగూడెం, బండివారిగూడెం, అప్పలరాజుగూడెం పంచాయతీల్లోని రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నూతన కాటా ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి కూడా లభిస్తుందని ఆయన తెలిపారు. నాళం పూర్ణ కాశి విశ్వేశ్వరరావు, దాసరి రాంబాబు, గెడా శ్రీధర్, సాధు చిన పెంటయ్య, దాసరి నాగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల అందజేత

పోలవరం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలతో విద్యార్థులు చదువులో రాణించాలని ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. సోమవారం పోలవరం మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. టీడీపీ మండలాధ్యక్షులు మంగిన కొండ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కూటమి నాయకులు నునకాని రాంబాబు, గునపర్తి చిన్ని, కొణతాల ప్రసాద్, ఆకుల రాజా, నల్లా రాంబాబు, పూడి వీరవెంకట సత్యనారాయణ, బెజవాడ గోపి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

పెదవేగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం రామశింగవరం జడ్పీ ఉన్నతపాఠశాల టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సీనియర్ విద్యావేత్తలతో యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను విశ్రాంత ఉపాధ్యాయురాలు వేమూరి చెంచులక్ష్మి ఆర్థిక సాయంతో సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను, పెదవేగి ఎంఈవో -1 ఐ.వి.వి.ప్రభాకరరావు చేతుల మీదుగా యూటీఎఫ్ మండల శాఖ నాయకులు సోమవారం అందించారు.

పాతూరులో ఉచిత నేత్ర పరీక్షలు

కామవరపుకోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని జాగృతి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం పాతూరులో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి 40 మందికి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న వారిని గుర్తించి 12 మందికి కళ్లజోళ్లు అందజేశారు. ఒకరికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

ద్వారకాతిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోపాలపురం నియోజకవర్గంలో అనుబంధ కమిటీ అధ్యక్షులుగా మండలంలోని పలువురు నియమితులయ్యారు. ఇందులో తెలుగు మహిళా అధ్యక్షురాలిగా ద్వారకాతిరుమల మండలంలోని రాజుపాలేనికి చెందిన కాకర్ల రామతులసి,వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ద్వారకాతిరుమల టీడీపీ సీనియర్ నేత ఇమ్మడి రత్నాజీ, తెలుగు యువతకు మారంపల్లికి చెందిన పాతూరి సహృదయ్, విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడిగా దొరసానిపాడుకు చెందిన లక్కాబత్తుల రమేష్, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా గుణ్ణంపల్లికి చెందిన ఆలపాటి సాయి నియమితులయ్యారు.

టెన్త్‌లో మంచి మార్కులు సాధించాలి

ఏలూరుటూటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని నగర పాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం అన్నారు. కస్తూరిబా గర్ల్స్ హైస్కూల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. టెన్త్ విద్యార్థులకు విజయకేతనం పేరిట 100రోజుల ప్రోగ్రాంను ఒకే పుస్తకంలో ప్రశ్నలు, జవాబులు ముద్రించిన పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్ట ప్రాంతానికి ఎమ్మెల్సీ ఇవ్వాలి

కొయ్యలగూడెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతానికి ఎమ్మెల్సీ కేటాయించాలని కొయ్యలగూడెం టీడీపీ మండలాధ్యక్షుడు మాజీ ఏఎంసీ ఛైర్మన్ పారేపల్లి రామారావు నారా లోకేశ్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం మంగళగిరిలో లోకేశ్ నిర్వహించిన శిక్షణ తరగతులు ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్‌తో మాట్లాడినట్లు పారేపల్లి తెలిపారు. ఏలూరు జిల్లాలోని మెట్టప్రాంత నియోజకవర్గాలైన పోలవరం, చింతలపూడి నియోజకవర్గాలకు ఒక ఎమ్మెల్సీ స్థానం ఇవ్వాలన్నారు.

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం

ఏలూరు క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా అడ్డువచ్చిన వాహనాన్ని తప్పించబోయి ఫ్లైఓవర్ బ్రిడ్జి ఫుట్ పాత్‌పైకి ఆర్టీసీ బస్సు ఎక్కేసింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం కలిగించకుండా డ్రైవర్ సమయస్ఫూర్తితో కాపాడారు. సోమవారం తెల్లవారు జామున రాజమహేంద్రవరం నుంచి విజయవాడకు వెళ్తున్న ఆర్టీసీ లగ్జరీ బస్సు ఏలూరులోని కొత్త బస్టాండ్‌కు వెళ్తోంది. ఏలూరులోని జ్యూట్ మిల్లు వంతెన వద్ద ఎదురుగా ఒక వాహనం మీదకు రావడంతో దానిని తప్పించడానికి డ్రైవర్ ఫుట్‌పాత్ ఎక్కించి ఎలాంటి ప్రమాదం జరుగకుండా సమయస్ఫూర్తితో డ్రైవర్ కాపాడారు. ఆ సమయంలో బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నారు.

ఆలయాల్లో భగవద్గీత పారాయణం

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : రామచంద్రరావుపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం మార్గశిర శుద్ధ ఏకాదశి గీతా జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని స్వామికి ప్రధానార్చకులు కిళాంబి మారుతి శ్రీనివాస రామానుజాచార్యులు పూజలు చేశారు. భగవద్గీత పారాయణ మండలి సభ్యులు భగవద్గీతను పఠించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్, గంగాధరరావు, శ్రీనివాసరావు చేశారు. అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ భగవానుని ఉప ఆలయం వద్ద వేడుకలను నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ శ్రీకృష్ణ భగవానుడి విగ్రహానికి అలంకరణ నిర్వహించి ప్రత్యేక హారతులిచ్చి పూజలు జరిపించారు.ఆలయ మేనేజర్ ఓలేటి మల్లికార్జునరావు బృందానికి ఏర్పాట్లు చేశారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ

టి.నరసాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన గృహిణి భగవద్గీత కంఠస్థ పోటీల్లో ప్రతిభ చూపింది. కర్ణాటక రాష్ట్రం మైసూరు అవధూత దత్త పీఠంలో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. టి.నరసాపురానికి చెందిన మండం వెంకట మహాలక్ష్మి ఏడాదిగా భగవద్గీతను నిత్యం పారాయణ చేస్తున్నారు. ఇటీవల అవధూత దత్తపీఠం ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహాలక్ష్మి పాల్గొని భగవద్గీతను అలవోకగా ఉచ్చరిస్తూ ఉత్తమ ప్రతిభ చూపారు. గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్‌ను, సర్టిఫికెట్‌ను అందుకున్నారు.



గోల్డ్ మెడల్ అందుకుంటున్న మహాలక్ష్మి

విద్యా రోహిణి పబ్లిక్ స్కూల్లో గీతా జయంతి

బుట్టాయగూడెం: విద్యా రోహిణి పబ్లిక్ స్కూల్లో గీతా జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో భగవద్గీత కంఠస్థ పోటీలను జంగారెడ్డిగూడెం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించగా పాఠశాలకు చెందిన విద్యార్థులు డి.సుశ్మ, ఎం.ప్రణతి, కె.స్వాతి, పి.హర్షిత, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ తెలిపారు.

మట్టి తరలింపుపై చర్యలు తీసుకోండి

బుట్టాయగూడెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పైదావారిగూడెం సమీపంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రధాన కుడి కాలువలోని మట్టి దిబ్బల నుంచి అక్రమ మట్టిని తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పథకంలో ఏఈగా పని చేస్తున్న ఎం.నాగరాజు సోమవారం తహసీల్దార్ పి.వి.చలపతిరావుకు ఫిర్యాదు చేశారు. మట్టిని తవ్వుతున్న యంత్రాలను పోలీసుల సహకారంతో తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

పెదపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ఇవ్వాలని, మొంథా తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కొత్తూరులో నిరసన తెలిపారు. ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంలో నష్టపోతున్న కౌలురైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడం అన్యాయమన్నారు. రెడ్డియ్య, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



శివమాలతో ఉన్న స్వాములు

భీమడోలులో ఇరుముడులు

భీమడోలు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శివమాలధరించిన స్వాముల ఇరుముడి పూజలు భీమడోలులో ఘనంగా జరిగాయి. భీమడోలు పరిసర ప్రాంతాలకు చెందిన 45మంది భక్తులు స్థానిక పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. పూజల అనంతరం మాలధరించిన స్వాములు గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా భీమేశ్వర స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

డిప్యూటీ ఎంపీడీవోల బాధ్యతలు

లింగపాలెం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆయా మండలాల్లో డిప్యూటీ ఎంపీడీవోలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. డి.రంగనాయకమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉంగుటూరు మండలం రాచూరు గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రంగనాయకమ్మ పదోన్నతిపై లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు.

జంగారెడ్డిగూడేనికి డి.శాంతి



జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డిప్యూటీ ఎంపీడీవోగా డి.శాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

టి.నరసాపురానికి నాగలక్ష్మి



టి.నరసాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవోగా ఎల్.నాగలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని బండివారిగూడెం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న ఆమె డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. గతంలో పలు పంచాయతీల్లో కార్యదర్శిగా పని చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన నాగలక్ష్మికి ఎంపీడీవో జి.మణికుమారితో పాటు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ముగిసిన నిత్య భిక్ష

ఏలూరుకార్పొరేషన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రామకోటి ప్రాంగణంలో అన్నపూర్ణా సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో అక్టోబరు 13న ప్రారంభమైన నిత్య భిక్ష కార్యక్రమం సోమవారం ఘనంగా ముగిసింది. అయ్యప్ప స్వామికి ప్రత్యేక హారతులు, పూర్ణాహుతి నిర్వహించారు. సేవా కార్యక్రమంలో దాతలకు కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం భిక్ష కార్యక్రమాన్ని అన్నదాన సమాజం ఆధ్వర్యంలో నిర్వహించారు.

స.హ.చట్టంపై అవగాహన ర్యాలీ

చింతలపూడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు రెవెన్యూ సిబ్బందితో ర్యాలీ జరిపారు. రెవెన్యూ శాఖ పౌర సమాచార శాఖ అధికారిణి షేక్ షకీలున్నీసా మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం కోసం ఈ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ర్యాలీలో వీఆర్వోలు పాల్గొన్నారు.

మంటలు అంటుకుని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్టౌవ్ మంటలు అంటుకుని ఒక వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. భీమడోలు మండలం సూరప్పగూడేనికి చెందిన అందుగుల అలివేలు (75) సోమవారం సాయంత్రం 3 గంటల సమయంలో స్టౌవ్‌పై వేడి నీళ్ళు కాచుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని తీవ్ర గాయాలకు గురైంది. ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఆసుపత్రి వైద్యులు ధృవీకరించారు. ఈ సంఘటనపై ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

త్రోబాల్ పోటీలకు ఉపాధ్యాయినుల జట్టు ఎంపిక

నూజివీడు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండల స్థాయి మహిళా త్రోబాల్ ఎంపిక పోటీలను నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. నూజివీడు డీవైఈఈవో సుధాకర్, ఎంఈవో దేవ వరప్రసాద్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీవీఎల్ పుష్పలత, సువర్లత, గంగ భవాని, అనూరాధ, నాగజ్యోతి, పద్మ, చంగళ్లమ్మ, ఉమా లక్ష్మి, లీనా, శేషుకుమారి, కృష్ణకుమారి, షాహిదా, ఫిలోమినా, లత, జయమణి, జ్యోతిర్మయి, సరళ కుమారి ఎన్నికయ్యారు. పీడీలు రవీంద్ర, లక్ష్మీ, అన్నామని తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా ఉండదు

నూజివీడు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడుకు తాగునీటి సరఫరా చేసే కృష్ణా వాటర్ పైప్‌లైన్ లీకేజీ కారణంగా మంగళవారం పట్టణంలో తాగునీటి సరఫరా ఉండదని నూజివీడు మున్సిపల్ కమిషనర్ పీరయ్య తెలిపారు. మంగళవారం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, అవసరమైన వారు 90005 04539 నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.





సీఎంకు స్వాగతం పలికేందుకు వెళుతున్న ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులు





ముఖ్యమంత్రి చంద్రబాబుకు అభివాదం చేస్తున్న మహిళలు, పార్టీ అభిమానులు

చంద్రబాబుకు ఘన స్వాగతం

నిడమర్రు డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు నియోజకవర్గం నల్లమాడు పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. పౌర సరఫరాల శాఖామంత్రి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మ రాజు, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

సీఎంకు వరికంకుల దండ

పెదపాడు/పెదవేగి డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైతన్నల సంక్షేమానికి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రైతులు వరికంకుల దండతో స్వాగతం పలికారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సారధ్యంలో పెదపాడు మండలానికి చెందిన రైతులు, కూటమి నేతలు వరికంకుల దండను అందజేశారు. గుత్తా అనిల్, అక్కినేని వంశీకృష్ణ, మరడాని రవి తదితరు లున్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పుష్పం అందించి స్వాగతం పలకగా ప్రజా సంక్షేమం కోసం చేస్తున్న కృషిని సీఎం ప్రశంసించారు.

స్టాల్స్ పరిశీలన

సభావేదిక వద్ద ప్రత్యేక స్టాల్స్ ప్రదర్శించారు. హెలికాప్టర్ దిగిన చంద్రబాబు గోపీనాథపట్నం వెళ్లి అక్కడ సామాజిక పింఛన్లు పంపిణీ చేసిన అనంతరం నేరుగా సభా వేదిక వద్దకు చేరుకొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. రైతు పరిమి నాగేంద్ర ప్రసాద్ ఏర్పాటు చేసి ఒక ఎకరం భూమిలో ఫిష్ -ప్యాడీ క్రాప్ చేసే విధానం గురించి చంద్రబాబు అడిగి తెలుసుకొన్నారు. జిల్లా ఉద్యానవన అధికారి నాయక్ కోకోపీట్ ద్వారా రైతులు పొందుతున్న వ్యవసాయ ఉత్పత్తులు గురించి వివరించారు. మహిళా సమాఖ్య సభ్యులకు 181 కోట్ల రూపాయల స్త్రీ నిధి చెక్కులను అందజేశారు. ఇళ్లలో పెంచుకొనే నాటుకోళ్ల పెంపకం ప్రాజెక్టును ఆసక్తిగా తిలకించారు. ప్రతి కుటుంబానికి ఈకోళ్ల పెంపకం ద్వారా 22 వేలు ఆదాయం వస్తుందని అధికారులు తెలిపారు. అప్పడాలు అమ్ముకొని జీవిస్తున్న డ్వాక్రా మహిళకు తక్షణం ఇల్లు కట్టేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరక్టర్ ఆర్.విజయరాజు, స్త్రీనిధి డైరక్టర్ శ్రీహరి ప్రసాద్‌లు వివరాలు తెలియజేశారు. అటవీ శాఖ స్టాల్ ను సందర్శించారు.కొల్లేరు గురించి కలెక్టర్, ఎమ్మెల్యే కామినేని, ధర్మరాజులను వివరాలు అడిగి తెలుసుకొన్నారు. పాపికొండలు టూరిజం ప్రాజక్టు గురించి వివరాలు అడిగి తెలుసుకొన్నారు. కొరటూరులో ఎన్ని కాటేజీలు నిర్మాణం చేశారు ? వాటికి ఎంత డిమాండ్ ఉందో పరిశీలించి సుమారు 100 కాటేజీల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని డీఎఫ్‌వో విజయకు సూచించారు.



ఎకరం పొలంలో చేపలు, వరి సాగు చేసే విధానం గురించి వివరిస్తున్న రైతు పరిమి నాగేంద్ర

భారీ బందోబస్తు

ఏలూరు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌లు స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించి తగిన భద్రతా చర్యలు చేపట్టారు. వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణంలో ప్రతి ఒక్కరినీ మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు నిర్వహించి అనుమతించారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం ముఖ్యమంత్రి పర్యటించిన అన్ని ప్రాంతాల్లో బందో బస్తుతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.



బందోబస్తు పరిశీలిస్తున్న ఐజీ,ఎస్పీ



రోడ్డుకు అడ్డున్న వాహ నాలు తరలిస్తున్న పోలీస్ వాహనం



పాడి రైతులకు బోనస్ పంపిణీ

ఏలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి పరిధి లోని పాడి రైతులకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి రెండో విడత బోనస్‌గా రూ.2.8 కోట్ల చెక్కును సీఎం నల్లమాడులో సోమవారం అందజేశారు.పాడి రైతుల సంక్షేమా నికి కృషి చేస్తుందని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు వివరించారు.



వివాహేతర సంబంధాలు పెట్టుకోవద్దు..



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి పెద ఖాసిం

నూజివీడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రి లో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సీనియర్ సివిల్ జడ్జి పెద ఖాసిం ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఎయిడ్స్ ఎవరూ వివా హేతర సంబంధాలు పెట్టుకొని ఇలాం టి వ్యాధులకు గురికావద్దని, ఎయిడ్స్ సోకిన వారు తప్పకుండా ఆస్పత్రికి వెళ్లి మందులు వాడాలని సూచించారు. సీనియర్ న్యాయవాది ఎస్‌కేడీ ప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మజరాణి, మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి, అన్నవరం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను నూజివీడు సబ్ కలె క్టర్ బి. వినూత్న ఆకస్మిక తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరుపై రైతులు, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు నేరుగా తమ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవడం వల్ల మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. అలాగే రైతులకు అవసరమయ్యే గోనె సంచులు, టార్పాలిన్లు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తహసీల్దార్ బద్రు, మండల వ్యవసాయాధికారి పి. చెన్నారావు పాల్గొన్నారు.



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

చాట్రాయి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జనార్దనవరంలో సోమవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు మాదాసు చిన్న పుల్లయ్య సమక్షంలో 11 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై టీడీపీలో చేరినట్లు దారా నాగవేంద్రరావు, రాఘవేంద్రరావు, వీర్ల మాధవి తదితరులు చెప్పారు. టీడీపీ నాయకులు వంగల సుబ్బారావు, పామర్తి నాగరాజు, బలుసూరి రత్తయ్య, మాదిరాజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కమ్మిలి విఠలరావు

కైకలూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. సోమవారం కైకలూరులో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన తల్లి కామినేని రాజేశ్వరమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను విఠలరావు ప్రారంభించారు. పలు ప్రాంతాలకు చెందిన వాలీబాల్ టీంలు పెద్దఎత్తున పాల్గొన్నాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహిస్తారు. మూడో రోజు ఫైనల్స్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ఎమ్మెల్యే కామినేని పంపిణీ చేస్తారు.

స్నేహ రైడ్స్ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ డేను పురస్కరించుకొని ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో నూజివీడు స్నేహ రైడ్స్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. హెచ్ఐవీ నియంత్రణపై ఈ విద్యార్థులు స్కిట్టును ప్రదర్శించి ప్రథమ స్థానం సాధించగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు.

అప్స ఓవరాల్ ఛాంపియన్‌గా త్రివిధ

నూజివీడు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూజివీడు త్రివిధ పాఠశాల క్రీడా ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న అప్స ఆటల పోటీలు ముగిసాయి. త్రివిధ పాఠశాల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. గెలుపొందిన విద్యార్థులకు నూజివీడు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి సుధాకర్ బహుమతులు అందజేశారు. పలు పాఠశాలల కరస్పాం డెంట్‌లు పాల్గొన్నారు.



కైకలూరులో పెన్షన్ పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి

కైకలూరు: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం పేదలకు వరమని ప్రతి నెలా 1న ఉదయమే లబ్ధిదారుల ఇళ్ల వద్ద పెన్షన్ పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని టీడీపీ కోకన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మి అన్నారు. సోమవారం ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్‌ను కైకలూరులో పంపిణీ చేశారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి 16వ బూత్‌లో పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడమటి వాసు, మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ, మాజీ ఎంపీటీసీ పైడిమర్రి రాధాకృష్ణ, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కెకె బాబు, కైకలూరు మండల ప్రధాన కార్యదర్శి పి. రాధాకృష్ణ, బంకపల్లి సీతమ్మ పాల్గొన్నారు.



ఉదయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

అంకిత భావంతో పనిచేయాలి

కలిదిండి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అధికారులు అంకితభావంతో పనిచేస్తే ప్రజల మన్ననలను పొందుతారని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం కలిదిండి పంచాయతీ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన పంచాయతీ కార్యదర్శి ఆర్. ఉదయ్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, సర్పంచ్ ఎం. మారుతి ప్రసన్న, డిప్యూటీ ఎంపీడీవో మారుతీ ప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'దిత్వా'తో రైతుల పాట్లు

ముదినేపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను ప్రభావం తగ్గిందని చెబుతున్నప్పటికీ ముదినేపల్లి ప్రాంతంలో సోమవారం కురిసిన ఒక మాదిరి వర్షం రైతులను ఆందోళనకు గురి చేసింది. పొలాల్లో పనమీద ఉన్న సార్వా వరి పైరును ఒడ్డుకు చేర్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. తరచు జల్లులు పడుతున్న పరిస్థితుల్లో ధాన్యంలో ఇప్పట్లో తేమ శాతం తగ్గే అవకాశాలు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముదినేపల్లి నుంచి గుడివాడ, కైకలూరు ప్రధాన రహదార్ల వెంబడి వందలాది మెట్రిక్ టన్నుల ధాన్యం రాసుల నిల్వలు ఉన్నాయి.



సహస్ర దీపాలంకరణ

ముదినేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): షష్టి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ వీరభద్రరావు బందోబస్తు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కలశారాధన అనంతరం సహస్ర లింగార్చన, లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం యాజ్ఞికుడు గూడూరు శివరామకృష్ణ, వేద పండితులు కోట శివశంకర శర్మ, తేలేటి వీరభద్ర శర్మ తదితరులు సహస్ర దీపాలంకరణ పూజలు జరిపారు. మహిళలు శివలింగం ఆకారంలో దీపారాధన జరిపారు.

పేదలకు వరం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

ముదినేపల్లి: మండలంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ 95 శాతం పూర్తయిందని, 8674 మంది పెన్షనర్లకు రూ. 3.82 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా 8200 మందికి రూ. 3.69 కోట్ల పెన్షన్ సొమ్మును అందచేసినట్లు ఎంపీడీవో వై. రామకృష్ణ తెలిపారు. వడాలిలో టీడీపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పెన్షన్లు పంపిణీ చేయగా అల్లూరులో తెలుగు యువత అధ్యక్షుడు దావునాగరాజు, ఊటుకూరులో పార్టీ జిల్లా కార్యదర్శి పోసిన పాండురంగారావు, బొమ్మినంపాడులో మండల ఉపాధ్యక్షుడు యర్రా రాంబాబు, పంపిణీ చేశారు. ముదినేపల్లి, చిగురుకోట, పెదకామనపూడి గ్రామాల్లో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ అందజేశారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి: చాట్రాయి మండలంలో సామాజిక పెన్షన్లు సోమవారం సాయంత్రానికి 89.11 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో బి. రాజు తెలిపారు. మండలంలో మొత్తం 8284 పెన్షన్లు ఉండగా 7427 మందికి పంపిణీ జరిగిందని మిగిలిన వారికి మంగళవారం పంపిణీ చేస్తామని ఎంపీడీవో అన్నారు. ఆరుగొలనుపేటలో మండల టీడీపీ అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, చనుబండలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, నాయకులు పంపిణీ చేశారు. ఎంపీడీవో రాజు పరిశీలించారు.

ముసునూరు: ఎన్నికల్లో హామీ మేరకు పెన్షన్ పెంచి ప్రతి నెలా ఒకటో తేదీనే పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తుందని నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి ఎంపీడీవో పిల్లి ఏసుబాబు, టీడీపీ నాయకులు కొండేటి ఉదయ్‌కిరణ్ (బాబి), రాములు, దేవినేని ఢలరాం అన్నారు. ముసునూరులో లబ్ధిదారులకు పెన్షన్ నగదును వారు అందజేశారు. పెన్షన్ పంపిణీని డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి ఎంపీడీవో పరిశీలించారు. 95 శాతం పెన్షన్లు పంపిణీ పూర్తయినట్లు ఆయన తెలిపారు.



ఆగిరిపల్లి: మండలంలో సచివాలయం సిబ్బందితో కలిసి టీడీపీ నాయకులు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు. కొత్త ఈదరలో సోమవారం బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి దొడ్డా నాగరాజు వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేశారు. కేంద్ర, ప్రభుత్వాలు ప్రజల కోసం సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టడంలో ముందున్నాయన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యం



కైకలూరులో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

కైకలూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీలత అన్నారు. సోమవారం ఎయిడ్స్ డే సందర్భంగా కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఓరియంటల్ జడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహనతో ముందస్తుగా వ్యాధిని గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ లెక్కల ప్రకారం 2025 నాటికి లక్ష జనాభాలో 44 నుంచి 39 శాతానికి తగ్గిందన్నారు. 2030 నాటికి 90 శాతం తగ్గుదల కనిపిస్తుందని ఈ లక్ష్య సాధనకు చికిత్స, నివారణపై దృష్టి సారించాలన్నారు. అవగాహన కార్యక్రమాలు ఎయిడ్స్ నివారణకు దోహదపడతాయన్నారు. డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రిన్సిపాల్ అందజేశారు. హెచ్ఎం కె విష్ణుమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అడపా కేధారి, రెడ్‌రిబ్బన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: ఎయిడ్స్‌కు చికిత్స ఉందని నూజివీడు అర్బన్ క్లినిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. సాయిసుధ అన్నారు. నూజివీడు మున్సిపల్ పరిధిలోని కోనేరుపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఎయిడ్స్ డేను పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్షితం కాని శృంగారం, రక్తమార్పిడి, శుద్ధి చేయని సూదుల ద్వారా ఎయిడ్స్ వ్యాపిస్తుందన్నారు. హెచ్‌వీ కుమారి, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండి పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఆశా వర్కర్లు సోమవారం కలిదిండిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటే ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యాధికారిణి జాహ్నవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నేనున్నానని..

(5వ పేజీ తరువాయి)

ముచ్చటించారు. అలాగే సీఎం ఉంగుటూ రుకు వరాల జల్లు కురిపించారు. నల్లజర్ల రోడ్డు విస్తరణ, ఇంటర్ కాలేజీ భవనాలు, గురుకుల పాఠశాల భవనాల నిర్మాణంతోపాటు చింతలపూడి ఎత్తిపోతల పూర్తికి చర్యలు తీసుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. నల్లమాడులో సీసీ రోడ్లు, మరుగుదొడ్లు ఇతర పనులను పూర్తి చేయడానికి కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

హార్టికల్చర్ అసిస్టెంట్‌కు చంద్రబాబు క్లాస్

నల్లమాడులో ఇళ్లు, ఇతర వివరాలను ప్రకటించిన హార్టి కల్చర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్‌కు చంద్రబాబు క్లాస్ తీసు కున్నారు. పంటల సాగు వివరాలు, టాయిలెట్లు, ఇళ్ల తది తర వివరాలపై పొంతన లేని లెక్కలు చెప్పడంపై ఏం ప్రిపేర్ అయ్యి వచ్చావా అంటూ ప్రశ్నించారు. పామాయిల్ సాగు విస్తీర్ణంలో ఉత్పాదకత పెంచడానికి ఏం చర్యలు తీసుకున్నావని అడగ్గా నీళ్ల నమిలారు. ఒక ప్రణాళిక ప్రకారం పంటల సాగులో రైతులను ముందుకు నడపించాలి. మళ్లీ వస్తా.. అప్పటికే రైతులకు పంటలపై తగు సలహాలు, సూచనలు ఇచ్చి సంసిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కలెక్టర్ కె.వెట్రి సెల్వి మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాల వృద్ధి రేటులో జిల్లా ఐదో స్థానంలో ఉందని, మూడో స్థానానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు.

సీఎం పర్యటనలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారధి, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పెందుర్తి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, బడేటి చంటి, మద్దిపాటి వెంకట్రాజు, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే మురళీ, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కిశోర్, జేసీ ఎంజే అభిషేక్ గౌడ, జెడ్పీ సీఈవో శ్రీహరి, సీపీవో వాసుదేవరావు పాల్గొన్నారు.

ఐదు గంటలపాటు వడివడిగా

- సీఎం చంద్రబాబు ఐదు గంటలపాటు ఉంగుటూరు మండలంలో పర్యటించారు.
- ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన ఆయన ఉదయం 11.40 గంటలకు నల్లమాడు చేరుకున్నారు. అక్కడ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు.
- రోడ్డు మార్గాన గోపీనాథపట్నం వెళ్లి అక్కడ కిడ్నీ బాధితురాలు నాగలక్ష్మికి పింఛన్ పంపిణీ చేసి తిరిగి నల్లమాడులోని సభా ప్రాంగణానికి చేరుకున్నారు.
- అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను 25 నిమిషాలపాటు ఆసక్తిగా తిలకించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.
- మధ్యాహ్నం 12.50 గంటలకు ప్రజావేదిక పైకి వచ్చి గంటా పది నిమిషాలపాటు ప్రసంగించారు.
- అనంతరం ఉంగుటూరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశమై వారికి దిశా నిర్దేశం చేశారు.
- సాయంత్రం 4.50 గంటలకు హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరారు.

సీఎం సభలో పనిచేయని మైక్‌లు

నిడమర్రు: సీఎం సభలో మైకులు సరిగా పనిచేయకపోవడంతో కలెక్టర్ వెట్రి సెల్వి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లమాడు ప్రజావేదిక మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టర్ ప్రారంభోపన్యాసంతో సభ ప్రారంభమైంది. మైక్ సరిగా పనిచేయక ఆమె మాటలు ఎవరికి సరిగా వినిపించలేదు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతున్న సమయంలో కార్డ్‌లెస్ మైక్ పనిచేయకపోవడంతో ఆయన అసహనానికి గురయ్యారు. దీంతో వైరు మైక్‌తో మాట్లాడాల్సి వచ్చింది. ఆ తర్వాత మాట్లాడిన ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులుకు ఇదే పరిస్థితి ఎదురవడంతో ఇబ్బంది పడ్డారు. వెంటనే కలెక్టర్ వెట్రిసెల్వి వేగంగా స్టేజి దిగి మైక్ సెట్టింగ్ పాయింట్ వద్దకు వచ్చి సంబంధిత అధికారిపై మండిపడ్డారు. ఇదేమిటని నిలదీశారు. తక్షణం మైక్ సరిచేయాలని ఆదేశించడంతో ఐదు నిమిషాల్లో సమస్య పరిష్కారమైంది. తర్వాత కార్డ్ లెస్ మైక్‌లు పనిచేయడంతో సీఎం సభకు ఎలాంటి ఆటంకం కలగలేదు.

డిప్యూటీ ఎంపీడీవోలు బాధ్యతల స్వీకారం

ముదినేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండల గ్రామ సచివాలయాల విభాగం డిప్యూటీ ఎంపీడీవోగా తాతా వెంకట విజయ భాస్కర్ నియమితులయ్యారు. కృష్ణా జిల్లా గూడూరు పంచాయతీ గ్రేడ్ -1 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆయన ప్రమోషన్‌పై ఇక్కడకు బదిలీ అయి సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో సచివాలయాల వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని విజయభాస్కర్ తెలిపారు. ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీల డిప్యూటీ ఎంపీడీవో అశోక్, కార్యాలయ ఏఓ రమణారావు, సిబ్బంది ఆయనను అభినందించారు.

మండవల్లి: మండవల్లి డిప్యూటీ ఎంపీడీవోగా నాగమణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఘంటసాల మండలం కొడాలిలో కార్యదర్శిగా విధులు నిర్వహించి ప్రస్తుతం డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతిపై మండవల్లి మండలంలో గ్రామసచివాలయాల డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. ఎంపీడీవో కె రమణబాబు ఈమెకు బాధ్యతలు అప్పగించారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మండల సచివాలయ డిప్యూటీ ఎంపీడీవోగా పి. దుర్గారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూజివీడు డీఎల్‌పిఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడ బాధ్య తలను చేపట్టారు. ఆగిరిపల్లి మండల కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన సువర్ణరాజు పదోన్నతి పొంది ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండల సచివాలయ డిప్యూటీ ఎంపీడీవోగా వెళ్ళారు.

రేషన్ షాపు పునః ప్రారంభం

కలిదిండి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా మూతపడిన గోపాలపురం గ్రామంలోని రేషన్‌షాపును ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి సోమవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకుల కోసం ప్రజలు ఇబ్బందిపడుతుండటంతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించామన్నారు. గోపాలపురం, వెంకటాపురం, సర్పంచ్‌లు వడ్డికాసులు, గూడవల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వాకాని కోటేశ్వరరావు, వీఆర్వో కమలహాసన్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ఎన్నారై ప్రతిభ

ఆగిరిపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీచర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆగిరిపల్లి ఎన్నారై కాలేజ్ అధ్యాపకులు కె చిన్నకృష్ణ, పల్లగాని వేణుగోపాల్ నాలుగో స్థానం సాధించారని కళాశాల చైర్మన్ ఆర్ వెంకట్రావు తెలిపారు. విజయవాడలో నవంబరు 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఏపీ కాలేజీ టీచర్స్ సంఘం ఆధ్వర్యం లో నిర్వహించారు. సుమారు 80 జట్లకు పైగా వివిధ కళాశాల నుంచి అధ్యాపకులు టోర్నమెంట్‌లో పాల్గొన్నట్టు తెలిపారు. విజేతలను అభినందించారు.

పీఏసీఎస్ చైర్మన్ చేయూత

చాట్రాయి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం పీఏసీఎస్ సభ్యుడు, రైతు వీరంకి కృష్ణమూర్తి ఇటీవల మృతి చెందడంతో సోమవారం అతని కుమారుడు వెంకటేశ్వరరావుకు పీఏసీఎస్ చైర్మన్ యర్రా ప్రసాదరావు రూ. 10 వేలు సాయం అందజేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు బిలుగుది జయరాజు, కూటమి నాయకులు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

కూటమి కార్యకర్తలతో గొడవలొద్దు

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర అభివృద్ధికి మన ప్రభుత్వం మళ్లీ రావాలి. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కంచుకోట.. కార్యకర్తలు అలగవద్దు' అంటూ ఆయన సుతిమెత్తగా హెచ్చ రించారు. మారిశెట్టి ప్రసాద్, ముత్యాల స్వామి, సత్తినీడి నాని, పొత్తూరి నర సింహరాజు, రుద్రరాజు కొండయ్య, గఫ్ఫార్‌ఖాన్, వేముల పల్లి సుధీర్, కడి యాల రవిశంకర్, పాతూరి విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.